ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -330 పేజీలు - 9 వెల - 03/- మంగళవారం17 మార్చి 2026

# అమరజీవి త్యాగం నేటి తరానికి స్ఫూర్తి

## అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ





- పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర
- స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం
- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- అమరావతిలో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు
- తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం
- అమరజీవి పొట్టి శ్రీరాములు
- నివాళి అర్పించిన డిప్యూటీ సిఎం పవన్
- ఒక మనిషి త్యాగం ..ఒక జాతి గౌరవం
- నివాళి అర్పించిన మంత్రి లోకేశ్

**అమరావతి,మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**
అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు,**మిగతా 2లో...**

# ట్రంప్‌కు షాక్

- హోర్ముజ్‌కు రక్షణ నౌకలను పంపబోమన్న మిత్రదేశాలు
- కాల్పుల విరమణను కోరలేదు -ఎన్నిరోజులైనా పోరాడుతాం: ఇరాన్
- దుబాయి ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ డ్రోన్ దాడి
- ఇజ్రాయిల్ నగరాలు, గల్ఫ్‌పై టెహ్రాన్ దాడులు ముమ్మరం
- జనావాసాలపై అమెరికా ఇజ్రాయిల్ దళాల బాంబుల వర్షం



**మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**
దాడులు, ప్రతి దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడికిపోతోంది. యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించినా ఇజ్రాయిల్-అమెరికా సేనలు కానీ, ఇరాన్ దళాలు కానీ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ డ్రోన్ దాడిలో దుబాయ్ విమానాశ్రయం సమీపంలో సోమవారం మంటలు చెలరేగాయి. విమానాశ్రయం సమీపంలో ఉన్న ఇంధన ట్యాంకుపై డ్రోన్ పడడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో అత్యవసర బృందాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. ముందు జాగ్రత్త చర్యగా విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.
**మిగతా 2లో...**






# 100 శాతం స్టాక్

- దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం ప్రకటన
- అన్ని రాష్ట్రాలలో ఎల్పీజీ స్టాక్ ఉందన్న కేంద్ర ప్రభుత్వం
- గృహ వినియోగదారుల కోసం 100 శాతం స్టాక్ ఉందన్న కేంద్రం
- హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలు క్షేమంగా ఉన్నాయని వెల్లడి
- ఎల్పీజీ క్యారియర్ నౌక శివాలిక్ సాయంత్రం భారత్ చేరుకుంటుందని వెల్లడి

2లో.


2లో.

బెంగాల్ పాలనాయంత్రాంగంపై
# ఈసీ పూర్తి పట్టు

- యాక్టింగ్ డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌పై ఈసీ వేటు
- కొత్త డీజీపీగా సిద్ధ్ నాథ్ గుప్తా, కమిషనర్‌గా అజయ్ కుమార్ నంద్ నియామకం
- ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీల బదిలీల తర్వాత పోలీసు శాఖలో ప్రక్షాళన
- శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికల కోసమే ఈ చర్యలని వెల్లడి
- ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్‌లో రెండు దశల పోలింగ్

# గుండెపోటు కథ ఆమె సృష్టే..

- వివేకా కేసులో సునీతపై అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు
- గుండెపోటు థియరీని సృష్టించింది సునీత అని ఆరోపణ
- క్రైమ్ సీన్‌లో దొరికిన లేఖను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని విమర్శ
- ఆస్తి తగాదాలు, డాక్యుమెంట్ల దొంగతనం కోణంలో విచారణ జరపాలని డిమాండ్


2లో.

# ఆస్కార్ ఉత్తమ చిత్రం ‘ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్’

ఉత్తమ నటుడు : మైఖేల్ బి జోర్డాన్, ఉత్తమ నటి : జెస్సీ బక్లీ, ఉత్తమ దర్శకుడు : పాల్ థామస్ అండర్సన్



**లాస్ ఏంజెల్స్‌మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**
లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యావత్ సినీ ప్రపంచం ఎంతో ఆస్తకిగా ఎదురు చూసిన ఈ ఆస్కార్ అవార్డుల్లో ‘వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్’ సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితోపాటు మరో 4 అవార్డులను దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించింది.’సిన్నర్స్’ చిత్రంలోని నటనకు గాను ఉత్తమ నటుడిగా మైఖేల్ బి జోర్డాన్, ‘హామ్నెట్’ చిత్రంలోని నటనకు గాను జెస్సీ బక్లీ ఉత్తమ నటిగా**మిగతా 2లో...**

# ముస్లింల సంక్షేమమే మా లక్ష్యం

- విజయవాడలో ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం చంద్రబాబు...
- ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- వక్ఫ్ ఆస్తులను కాపాడతామని, ముస్లింల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ
- గత 21 నెలల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించిన చంద్రబాబు



**విజయవాడ మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**
విజయవాడలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శు భాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన గొప్ప సూక్తి అని, మహ్మద్ ప్రవక్త బోధనలను స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.**మిగతా 2లో...**

# సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...

- తెలంగాణ కవి సిధారెడ్డికి జాతీయ పురస్కారం
- 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి దక్కిన గౌరవం
- కరోనా సమయంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను చూపించారని కేసీఆర్ ప్రశంస


2లో.

# 100 శాతం స్టాక్

## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం ప్రకటన

వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది.

పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నేడు సాయంత్రం 5 గంటలకు ఈ క్యారియర్ భారత్ చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.

పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.ం

## బెంగాల్ పాలనాయంత్రాంగంపై ఈసీ పూర్తి పట్టు

పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛాయుత, శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీలను బదిలీ చేసిన మరుసటి రోజే, పోలీసు శాఖలోనూ భారీ మార్పులు చేసింది. రాష్ట్ర యాక్టింగ్ డీజీపీ పీయూష్ పాండే, కోల్‌కతా పోలీస్ కమిషనర్ సుప్రతిమ్ సర్కార్‌లను తక్షణమే ఆ పదవుల నుంచి తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.నూతన డీజీపీగా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిద్ధ్ నాథ్ గుప్తాను, కోల్‌కతా నూతన పోలీస్ కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అజయ్ కుమార్ నంద్‌ను ఈసీ నియమించింది. వీరితో పాటు లా అండ్ ఆర్డర్ డీజీగా ఉన్న వినీత్ కుమార్ గోయల్‌ను కూడా తొలగించి, ఆయన స్థానంలో 1995 బ్యాచ్ అధికారి అజయ్ ముకుద్ రానడేను అదనపు డీజీగా (లా అండ్ ఆర్డర్) నియమించారు. మరోవైపు, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నటరాజన్ రమేశ్ బాబును డైరెక్టర్ జనరల్ ఆఫ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా పోస్టింగ్ ఇచ్చారు.బెంగాల్‌లో ఎన్నికలను హింసారహితంగా నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం జనవరి 30న నియమితులైన పాండే, సర్కార్‌లను రెండు నెలలు కూడా గడవకముందే మార్చడం గమనార్హం. ఆదివారం రాత్రి చీఫ్ సెక్రటరీ నందినీ చక్రవర్తి, హోం సెక్రటరీ జగదీశ్ ప్రసాద్ మీనాలను కూడా ఈసీ బదిలీ చేసి, వారి స్థానంలో దుష్యంత్ నరియాల, సంఘమిత్ర ఘోష్‌లను నియమించింది.కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

# హోర్ముజ్‌కు రక్షణ నౌకలను పంపబోమన్న మిత్రదేశాలు

**మొదటిపేజీ తరువాయి**

కొన్ని విమానాలను దుబాయి ఎయిర్‌పోర్టు నుంచి అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దారి మళ్లించారు. దుబాయి పౌర రక్షణ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. డ్రోన్ దాడి నేపథ్యంలో విమానాశ్రయ రోడ్డును, ఎయిర్‌పోర్ట్ టన్నెల్‌ను పోలీసులు మూసివేశారు. విమానాశ్రయ పరిసరాలపై డ్రోన్ దాడి జరగడం ఇది మొదటిసారి కాదని అధికారులు తెలిపారు.

**యూఏఈ చమురు వాణిజ్య హబ్‌పై**

దుబాయి విమానాశ్రయం ప్రాంతంలో దాడి జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఫుజైరా చమురు వాణిజ్య హబ్‌పై కూడా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ మంటలను అదుపు చేసేందుకు సహాయ సిబ్బంది ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. ఘటన తర్వాత చమురు లోడింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రపంచంలో ముడి చమురును, ఇంధనాలను నిల్వ చేసే అతి పెద్ద కేంద్రాలలో ఫుజైరా ఒకటి. ఇది యూఏఈకి చెందిన అబుధాబీ ముడి చమురు పైప్‌లైన్‌కు చివరన ఉంది.

హోర్ముజ్ జలసంధి ద్వారా కాకుండా ఇక్కడి నుంచి యూఏఈ ముడి చమురు సరఫరా అవుతుంటుంది. ఈ పైప్‌లైన్ ద్వారా రోజుకు ఒకటిన్నర మిలియన్ బ్యారల్స్ చమురును పంపవచ్చు. ఫుజైరా టెర్మినల్‌పై శనివారం కూడా దాడి జరిగింది. మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి యూఏఈపై ఇరాన్ 1,800కు పైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా ఆస్తులతో పాటు విమానాశ్రయాలు, ఓడరేవులు, చమురు కేంద్రాలు సహా పలు పౌర ప్రదేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.



**ఇరాన్‌పై బాంబుల వర్షం**

మరోవైపు అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. టెహ్రాన్, హమద్, ఇస్ఫహాన్, షిరాజ్, తబ్రిజ్ సహా పలు నగరాలు, పట్టణాలపై దాడులు జరుగుతున్నాయి. సెంట్రల్ టెహ్రాన్‌లో బాంబు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేశారు. ఇరాన్‌లో వరుసగా 17వ రోజు కూడా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. కాగా హెజ్బొల్లా దళాలను లక్ష్యంగా చేసుకొని దక్షిణ లెబనాన్‌లోని జబల్ అల్-బటమ్‌పై వైమానిక దాడులు జరిగాయి.

హెజ్బొల్లాపై పరిమిత స్థాయిలో భూతల దాడులు కూడా ప్రారంభించామని ఇజ్రాయిల్ తెలిపింది. రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఆదివారం రాత్రి విమాన దాడులు జరిగాయి. లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో ఇప్పటి వరకూ వంద మంది చిన్నారులు సహా 850 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని డ్రోన్ తయారీ కర్మాగారాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నామని, దీంతో ఆ దేశం యొక్క తయారీ సామర్థ్యం దెబ్బతిన్నదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. యుద్ధం మొదటి రోజు మరణించిన ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీ ఉపయోగించిన విమానాన్ని ధ్వంసం చేశామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది.

ఇరాన్‌లో ప్రధాన పారిశ్రామిక, రవాణా కేంద్రంగా కొనసాగుతున్న ఛాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలి సమీపంలోని సైనిక కేంద్రాలపై అమెరికా దళాలు వైమానిక దాడులు చేశాయి.

**హోర్ముజ్ రక్షణకు ట్రంప్ పిలుపు..**
**వస్తామంటూ చైనా షరతు**

ఇరాన్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హోర్ముజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు ముందుకురావాలని ట్రంప్ పలు దేశాలను కోరారు. ఈ విషయంపై చైనా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. హోర్ముజ్ రక్షణకు తాము ముందుకురావాలంటే.. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయన్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లిన్ జియాన్ అమెరికాకు సూచించారు.

ప్రస్తుత ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈనెల చివర్లో ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నా యన్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచు కోవడంలో ఈ పర్యటన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. హోర్ముజ్ ప్రాంతంలో చైనా ప్రయోజనాలే ఎక్కువని వ్యాఖ్యానిం చారు. ఆ జలసంధిని రక్షించేందుకు ముందుకురావాలని బీజింగ్‌కు పిలు పునిచ్చారు. ఆ దేశం ఇచ్చే సమాధానాన్ని బట్టి బీజింగ్ పర్యటనకు వెళ్లాలా, వాయిదా వేయాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

# గుండెపోటు కథ ఆమె సృష్టే..

## వివేకా కేసులో సునీతపై అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు

**విజయవాడ మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబుపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సునీత ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో అసలు విచారించాల్సిన కీలక అంశాలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విచారణను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసుకు సంబంధించి అనేక కీలక విషయాలను, తన వాదనలను ప్రజల ముందుంచారు.

వివేకా హత్య జరిగిన తర్వాత 'గుండెపోటు' అనే కథనాన్ని తెరపైకి తెచ్చిందే సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, బాబాయ్ నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి అని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. 2019 మార్చి 16న సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్వయంగా గుండెపోటు అనే అనుమానాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తన తండ్రికి గతంలో స్టెంట్ వేశారని, ఆ కారణంగానే గుండెపోటుతో బాత్రూంలో పడి మరణించి ఉండొచ్చని ఆమె చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దీనికి బలం చేకూరుస్తూ, బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డికి కూడా శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పిన వీడియోను అవినాశ్ ప్రదర్శించారు. తానే గుండెపోటు కథ అల్లి, ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.హత్య జరిగిన ప్రదేశంలో దొరికిన లేఖ అత్యంత కీలకమైన సాక్ష్యమని, ఆ విషయం తెలిసినా సునీత, ఆమె భర్త పోలీసులకు సమాచారం ఇవ్వలేదని అవినాశ్ ఆరోపించారు. పీఏ కృష్ణారెడ్డి ద్వారా లేఖ



ఫొటోలు, డెడ్ బాడీ ఫొటోలు చూసినా, అది హత్య అని స్పష్టంగా తెలుస్తున్నా విషయాన్ని దాచిపెట్టడం సాక్ష్యాలను తారుమారు చేయడమేనని అన్నారు. 2020 జులై 28న సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో లేఖ గురించి తనకు తెలుసని అంగీకరించిన సునీత, సరిగ్గా నెల రోజుల తర్వాత ఆగస్టు 27న ఇచ్చిన మరో స్టేట్‌మెంట్‌లో తనకు ఏమీ గుర్తులేదని చెప్పడం విచారణను పక్కదారి పట్టించడమేనని విమర్శించారు. ఒకసారి ఇచ్చిన వాంగ్మూలాన్ని కప్పిపుచ్చుకోవడానికి సీబీఐ మరో వాంగ్మూలం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ కేసులో ఎన్నో కీలకమైన అంశాలు ఉన్నప్పటికీ, వాటిపై సునీత ఎందుకు తదుపరి విచారణ కోరడం లేదని అవినాశ్ నిలదీశారు."నిందితుడు దస్తగిరి తన వాంగ్మూలంలో, హత్యకు ముందు వివేకాను డాక్యుమెంట్ల కోసం తీవ్రంగా కొట్టామని, వాటిని తీసుకున్నాకే చంపామని చెప్పాడు. ఆ కీలకమైన డాక్యుమెంట్లు ఏవి? వాటిని రికవరీ చేయాలని సునీత ఎందుకు అడగడం లేదు? వివేకా రెండో భార్య షమీం, ఆమె కుమారుడు షహన్‌షాకు ఆస్తులు చెందకుండా ఉండేందుకు ఈ హత్య జరిగి ఉండవచ్చన్న కోణంలో ఎందుకు విచారణ జరపడం లేదు? వివేకా తన ఆస్తులను వారికి ఇవ్వాలనుకున్న విషయం విచారణలో స్పష్టమైంది. దీనివల్ల నష్టపోయేది ఎవరు? ఆ దిశగా దర్యాప్తు జరపాలని ఎందుకు కోరడం లేదు?

దస్తగిరి తన స్టేట్‌మెంట్‌లో వివేకాకు ఉన్న అక్రమ సంబంధాల గురించి ప్రస్తావించాడు. ఆ నేపథ్యంలో కూడా హత్య జరిగి ఉండొచ్చు కదా? ఆ కోణంలో విచారణ జరపాలని ఎందుకు అడగడం లేదు?

హత్య జరిగిన రోజు రాత్రి వివేకా ఇంటి వద్ద ఉండే అటెండర్ పండింటి రాజశేఖర్‌ను, సునీత తల్లి సౌభాగ్యమ్మ, భర్త రాజశేఖర్ రెడ్డి బలవంతంగా కానిపాకం పంపించారు. ప్రతిరోజూ ఉండే అటెండర్‌ను ఆ ఒక్కరోజే ఎందుకు పంపించాల్సి వచ్చింది? ఇది అనుమానాస్పదం కాదా?" అని అవినాశ్ ప్రశ్నించారు.

హత్యలో తానే ఉన్నానని అంగీకరించిన అప్రూవర్ దస్తగిరి బెయిల్‌ను రద్దు చేయాలని తాము కోర్టుకు వెళితే, సునీత వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేసి, లూథ్రా వంటి సీనియర్ న్యాయవాదిని పెట్టి మరీ దస్తగిరి బెయిల్‌ను ఎందుకు కాపాడుతున్నారని అవినాశ్ ప్రశ్నించారు. ఇది వారి మధ్య ఉన్న కుమ్మక్కును బయటపెడుతోందన్నారు.

ఢిల్లీలోని ఓ తెలుగు పెద్దమనిషి అండతో సీబీఐ డైరెక్టర్‌ను నియమించుకుని, చంద్రబాబుతో కలిసి సునీత ఈ కేసు విచారణను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారని అవినాశ్ ఆరోపించారు. తాము చెప్పినట్టు వాంగ్మూలం ఇవ్వని సాక్షులను సీబీఐ విచారించలేదని, కేవలం ట్యూటర్ చేసిన సాక్షులతోనే స్టేట్‌మెంట్లు రికార్డు చేయించిందన్నారు. హిమకుంట్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని, "అవినాశ్ రెడ్డి గుండెపోటు అని చెప్పాడని నువ్వు చెప్పాలి" అని సునీత, ఆమె భర్త ఒత్తిడి చేశారని, కానీ ఆ వ్యక్తి అబద్ధం చెప్పడానికి నిరాకరించారని వివరించారు.

# అమరజీవి త్యాగం నేటి తరానికి స్ఫూర్తి

**మొదటిపేజీ తరువాయి**

ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్టాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు.

గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశు ్యలను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్**

"శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను" అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆస్కార్ ఉత్తమ చిత్రం 'ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'

**మొదటిపేజీ తరువాయి**

ఆస్కార్ అవార్డులను అందుకున్నారు.ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ పురస్కారాన్ని బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా అందజేశారు. కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణను ప్రేక్షకులు, విమర్శకులే కాదు ఆస్కార్ జ్యూరీ సైతం ఫిదా అవుతుందని 'ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమా నిరూపించింది. యావత్ ప్రపంచం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల్లో 13 విభాగాల్లో పోటీ పడిన ఈ సినిమా ఏకంగా 6 అవార్డులను గెల్చుకుని విజయకేతనాన్ని ఎగురవేసింది. తండ్రీ కొడుకుల అనుబంధం, భావోద్వేగాల నేపథ్యంలో బిడ్డ నమ్మకాన్ని గెలుచుకోవడం కోసం ఓ తండ్రి చేసిన పోరాటమే ఈ సినిమా. బ్లాక్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు.

**ఉత్తమ చిత్రం : ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్**

'ఇన్ మెమరియ్' సెగ్మెంట్‌లో హాలీవుడ్ ప్రముఖులతోపాటు మన భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్‌కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాలకు ఆస్కార్ ఘన నివాళి అర్పిస్తూ ఓ వీడియోను ఆస్కార్ పురస్కార ప్రదానోత్సవంలో ప్రదర్శించారు.

# ముస్లింల సంక్షేమమే మా లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**



కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అందించామని చంద్రబాబు వివరించారు. ఎన్టీఆర్ భరోసా కింద 4.38 లక్షల మంది ముస్లింలకు ఏటా రూ.3,511 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, 4.5 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' అందిస్తున్నామని, 19,215 మందికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కింద రూ.240 కోట్లు, దీపం పథకం ద్వారా 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు అందించామని చెప్పారు.

ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని రూ.5 వేలు, రూ.10 వేలకు పెంచి రూ.180 కోట్లు అందించామని, బకాయిలుగా ఉన్న రూ.45 కోట్లను కూడా విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించనున్నామని, వివాహ లైసెన్స్ గడువును 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచుతున్నామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచే 347 మంది హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తిచేశామని గుర్తుచేశారు.గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి, బోర్డుకు ఎన్నికలు నిర్వహించిందని, సుమారు 1500 వక్ఫ్ ఆస్తులపై సర్వే పూర్తి చేశామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ఫలాలను ముస్లింల సంక్షేమానికే వినియోగిస్తామని భరోసా ఇచ్చారు. నూర్ బాషా ఫెడరేషన్‌ను దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చి రూ.100 కోట్లు కేటాయించామన్నారు.మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,434 కోట్ల నుంచి ఈసారి రూ.6,090 కోట్లకు పెంచామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఉర్దూ అకాడమీకి కేవలం రూ.1 లక్ష ఇస్తే, తాము రూ.7 కోట్లు మంజూరు చేశామన్నారు. ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించామని, కడప, విజయవాడ నగరాల్లో హజ్ హౌస్‌ల నిర్మాణం త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...

## తెలంగాణ కవి సిధారెడ్డికి జాతీయ పురస్కారం

## 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి దక్కిన గౌరవం

**మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**



ప్రముఖ కవి, విమర్శకుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డిని అత్యున్నత 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు – 2025' వరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించిన వార్షిక పురస్కారాల్లో తెలుగు విభాగంలో ఆయన రాసిన 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి ఈ గౌరవం దక్కింది.ఈ సందర్భంగా సిధారెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, మట్టి వాసనను తన సాహిత్యంలో అక్షరబద్ధం చేసిన అరుదైన కవి సిధారెడ్డి అని కొనియాడారు. ముఖ్యంగా కరోనా సంక్షోభం సమయంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను 'అనిమేష' ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారని ఆయన ప్రశంసించారు. కేటీఆర్, హరీశ్ రావు, దేశపతి శ్రీనివాస్ వంటి ప్రముఖులు కూడా నందిని సిధారెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపారు.

# కొందరిలో చిరునవ్వు..
# కొందరిలో ఆందోళన

**పది పరీక్షలు ప్రారంభం -పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

**534 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 20 మంది గైర్హాజరు**





**బండి ఆత్మకూరు, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్):-** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి.అయితే పరీక్షలు ప్రారంభమైన తొలి రోజు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు కొందరు చిరునవ్వుతో ఉండగా.. మరి కొందరు విద్యార్థుల ముఖాల్లో ఆందోళన కనిపించింది. నిర్ణీత సమయంలోపు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కాగా అప్పటికే పరీక్ష కేంద్రాల వద్ద విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవసరమైన త్రాగు నీరు,విద్యుత్ సౌకర్యం, వైద్య సిబ్బంది ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక చికిత్స అందించే మెడిసిన్ వంటి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అలాగే పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు రూముల వారీగా విద్యార్థుల రోల్ నెంబర్లు కేటాయించి బయట నోటీస్ బోర్డు నందు పొందు పరిచారు. బండి ఆత్మకూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలకు కలిపి 534 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 514 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు యశోద ,మోహన్ రెడ్డిలు తెలిపారు, 20 మంది గైర్హాజరైనట్లు వీరు వివరించారు. పరీక్ష పత్రాలను పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును ఎస్ఐ జగన్మోహన్ పర్యవేక్షించారు.

## తోటి సహచరుని కుటుంబ సభ్యులకు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు అండ



**గుత్తి మార్చి 16( రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండలంలోని అబ్బే దొడ్డి గ్రామానికి చెందినటువంటి , ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి.గవ్వల కాశి రావు గత దినాల్లో బ్రెయిన్ స్ట్రోక్ తో మరణించడం.ఏపీ ఎమ్మార్పీఎస్ సంఘానికి, మాదిగ జాతి ప్రజలకు తీరని లోటు అని పామిడి సాకే ఓబులేసు అన్నారు.
ఈ సందర్భంగా పామిడి సాకే ఓబులేసు మాట్లాడుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో మొదటి నుంచి చాలా కీలకంగా పని చేశారన్నారు. ఆయన మరణ వార్త విని చాలా దిగ్భ్రాంతికి లోనయ్యామన్నారు. అబ్బే దొడ్డి గ్రామంలో కాశీ రావు స్వగృహం నందు ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తూ ఆయన భార్య, వారి సంతానం ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు వీరికి దేవుడి దీవెనలు అండగా ఉండాలని కోరుకుంటూ మాకు ఉన్నంతలో కొందరికి సహాయ పడదామనే సదుద్దేశంతో కాశిరావు కుటుంబ సభ్యులకు నాలుగు ప్యాకెట్ల బియ్యం, వంట సరుకులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పలకొండ పుల్లన్న, నాగసముద్రం ఆంజనేయులు, అబ్బేదొడ్డి లాలు, తదితరులు పాల్గొన్నారు

## చిప్పగిరి లో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్ష




**చిప్పగిరి, మార్చి, 16,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండల కేంద్రంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాధికారి సావిత్రమ్మ తెలిపారు ,పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులు ఫాతిమా పాఠశాలలో 235 మంది మొత్తం రెండు సెంటర్లో కలిపి 322 మంది విద్యార్థులు హాజరైనట్లు , ముగ్గురు ఆబ్సెంట్ అయినట్టు తెలిపారు.

## రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం




**చిప్పగిరి, మార్చి, 16,( రిపబ్లిక్ న్యూస్)** స్థానిక అగ్రికల్చర్ ఆఫీస్ నందు సోమవారం వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్, ఏఈఓ రమాదేవి, ఆధ్వర్యంలో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి చిప్పగిరి తెలుగుదేశం పార్టీ సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, సర్పంచ్ దాసరి గోవిందరాజులు, పాల్గొన్నారు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు రైతులకు భరోసా కల్పించి కార్యక్రమం జరుగుతుందని రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రతి అన్నదాతలకు అండగా నిలబడడం మన ప్రభుత్వ లక్ష్యమని, పిఎం కిషన్ అన్నదాత సుఖీభవ పథకాలు ద్వారా రైతులకు ఆర్థిక వెన్ను దన్ను అందిస్తుందని, అనంతరం రైతులకు నగదు జమ అయిందా లేదా తెలుసుకొని కర్ర పత్రాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎంటి రేవన్న, ఆర్ఎస్కె ఇన్చార్యులు ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ కర్నూలు జిల్లా 21వ మహాసభలను జయప్రదం చేయండి



**చిప్పగిరి, మార్చి, 16,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి అమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటియుసి కర్నూలు జిల్లా 21 మహాసభలను జయప్రదం చేయండి అని సోమవారం పోస్టర్లను విడుదల చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు రాజా సాహెబ్, సిపిఐ మండల కార్యదర్శి రంగన్న, పాల్గొన్నారు, మార్చ్ 28 ఆలూరు లో జరిగే కార్మిక ర్యాలీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో అమాలి వర్కర్స్, యూనియన్ నాయకులు, రాముడు, సిద్దప్ప, వెంకన్న ,తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ అధికారుల పైనే దర్బార్..

**- ఎవరో ఒకరు చేసే పనికి పాత్రికేయులందరికీ దొబ్బుడే..!**

**- మీడియా ముసుగులో బెదిరింపులా.. - ఇలాంటి వారితో తోటి రిపోర్టర్లకు చెడ్డపేరే..**






**మదనపల్లి మార్చి 16 - (రిపబ్లిక్ న్యూస్) -**
విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారులను ఓ యువకుడు రిపోర్టర్ పేరుతో బెదిరింపులకు దిగిన ఘటన సోమవారం తెల్లవారిజామున మదనపల్లిపట్టణ పరిధి లో కలకలం రేపింది. డీటీవో అశోక్ ప్రతాప్ రావు, ఎంవీఐలు దినేష్ చంద్ర, శివలింగయ్య, శ్రీహరిలు కలిసి మదనపల్లి పట్టణ సరిహద్దులో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అలా ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై కొరడా విధించేందుకు సన్నద్ధమయ్యారు. వీళ్ళు అనుకున్నట్టుగానే మదనపల్లి నుంచి బెంగళూరుకు తరలిస్తున్న 'బాబ్లా' కార్లను తనిఖీ చేపట్టేందుకు ఆపారు. బండి కి గల రికార్డ్స్ ను వ్యక్తికి సంబంధించిన రికార్డ్స్ ను తీసుకురమ్మని ఆదేశించారు. ఈ క్రమంలో కారు దిగి వాళ్ల దగ్గరకు చేరుకున్న ఓ యువకుడు తాను జిల్లా రిపోర్టర్ నని చెప్పుకుంటూ అధికారులనే దబాయించే యత్నం చేశాడు. అధికారులు మాట్లాడుతుండగా వీడియో తీసి మీ పని మీరు చూసుకోండి. నా పని నేను చూసుకుంటానని బ్లాక్ మెయిల్ చేస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగించాడు. మీడియా ముసుగులో అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా తను రిపోర్టర్ నని చెప్పుకొంటూ అధికారులను భయపెట్టే యత్నం చేశాడు. మీడియా మిత్రులతో ఫ్రెండ్లీగా ఉంటూ తమ పని చేసుకుంటున్న అధికారులనే భయపెట్టేలా ప్రవర్తించిన ఆ యువకుడి తీరుపై రవాణా శాఖ అధికారులు విస్మయానికి గురయ్యారు. మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడే ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులు తమ పనిని చేస్తుంటే ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడటం సబబు కాదని తోటి పాత్రికేయులు వాపోతున్నారు..

## వైశ్యరత్నా శ్రీ పొట్టి శ్రీరాములు 125 వ జయతి వేడుకలు

**గుత్తి మార్చి 16( రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి పట్టణంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్య అతిథులు గా రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎం.కె చౌదరి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ.పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణాలను అర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు . ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన 58 రోజుల నిరాహార దీక్ష భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.ఆయన త్యాగమే ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపింది.ప్రజల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహా నాయకుడిగా పొట్టి శ్రీరాములు ఎప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోతారు.ఆయన ఆశయాలను గుర్తు చేసుకుంటూ.ప్రజల స్వాభిమానం కోసం పోరాటం



ఎప్పటికీ ఆగదు.అలాగే కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మహానియుడు చేసిన సేవలకు కి గుర్తింపుగా అమరావతి లో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చెయ్యడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్ కార్యదర్శి కిషోర్ బాబు సుదర్శన్ సాయి వెంకటేష్ వెంకట్ మహేష్ మల్లికార్జున మధు సుధీర్ మాజీ సర్పంచ్ సుంకన్న, మాజీ కౌన్సిలర్ సుంకన్న టీడీపీ సీనియర్ నాయకులు నరేంద్ర చౌదరి, ఎస్ ఎం భాష ,మల్లికార్జున, సుంకన్న,కృష్ణ గోపాల్ ,శేఖర్ ,రాహుల్, ఆది శేషు, నాయకులు పాల్గొనడం జరిగింది,



## మాన్య కాన్షీరామ్ జయంతి వేడుకలు

**గుత్తి మార్చి 16( రిపబ్లిక్ న్యూస్ )**
గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద మాన్యం శ్రీ కాన్షీరామ్ జయ ఉత్సవాలు నిర్వహించారు ముందుగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళు లర్పించారు. బీఎస్పీ పార్టీ గుంతకల్ నియోజకవర్గం ఇంచార్జ్ విజయ్.బండల రామాంజనేయులు. మాట్లాడుతూ బహుజనులను రాజ్యాధికారానికి దగ్గర చేసినవారు కాన్షీరామ్.బహుజనులను రాజ్యాధికారానికి దగ్గర చేసినవారు కాన్షీరామ్. 1934 మార్చి 15న పంజాబ్ రాష్ట్రం రోపడ్ జిల్లా కావాస్పూర్ గ్రామంలో జన్మించారు. బీఎస్సీ చదివి రక్షణ శాఖలో చేరారు. 1965లో అంబేద్కర్ జయంతినాడు సెలవు ప్రకటించాలని చేపట్టిన ఆందోళనతో ఆయన ఉద్యమ జీవితం ప్రారంభమైంది.అంబేద్కర్ రాసిన 'కుల నిర్మూలన' పుస్తకం స్ఫూర్తితో పీడిత వర్గాల జీవితాల్ని రాజ్యాధికారం దిశగా తన నాయకత్వంలో ముందుకు



నడిపారు. గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహూ మహారాజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నారాయణ గురు, పెరియార్ లాంటి వారిని గురువులుగా భావించారు. వారి ప్రభావంతోనే 1971లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. తదనంతరం 1978లో బ్యాక్వార్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బామ్ సెఫ్)ను స్థాపించి అణగారిన వర్గాలలో ఎదిగినవారు తమ వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా కృషి చేశారు. 'రాజ్యాధికారమే ' అన్న అంబేద్కర్ మాటలను ఆదర్శంగా తీసుకొని 1984లో బహుజన్ సమాజ్ పార్టీ స్థాపించారు. బహుజన సమాజాన్ని రాజ్యాధికారం వైపు నడిపించడానికి అంబేద్కర్ చెప్పిన విధంగా 'బోధించు, సమీకరించు, పోరాడు' సిద్ధాంతానికి అనుగుణంగా 1983 మార్చి 15న ఢిల్లీ నుండి బయలుదేరి. ఏడు రాష్ట్రాల మీదుగా 100 సైకిళ్ళతో 40 రోజులలో 4,200 కిలోమీటర్లు ప్రయాణించి. ప్రజలనుబహుజన ఉద్యమం వైపు మరల్చిన గొప్ప వ్యక్తి కాన్షీరాం. ఆయన అలుపెరగని పోరాటంతో. ఉత్తరప్రదేశ్లో బహుజనులు కొన్ని సార్లు అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే కాక.దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ గణనీయమైన రాజకీయ శక్తిగా ఎదిగారు. ఈ కార్యక్రమంలో కొండన్న సుధాకర్ రంగమ్మ అనురాధ రమేష్ విజయ్ ఓబులేష్ రంగా నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



**బండి ఆత్మకూరు, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్):-**
పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని బండి ఆత్మకూరు పశు వైద్యాధికారిని డాక్టర్ అనూష, పార్నపల్లి పశువైద్యాధికారిని డాక్టర్ జోష్ణ లు సూచించారు. సోమవారం బండి ఆత్మకూరు, పార్నపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. బండి ఆత్మకూరు 500 పశువులు, సంత జూటూరులో 200 పశు వులకు గాలికుంటు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిని తెలిపారు. అలాగే పార్నపల్లిలో 600 పశువులకు టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారిని జ్యోత్స్న వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రామాంజనేయులు, పాపిరెడ్డి, జయశ్రీ అర్జున్ సతీష్ శివశంకర్ రెడ్డి, సమీరా ఉమా ప్రసన్న, రామకృష్ణ, రమేష్, గోపాల మిత్రలు శంకర్ పిరు బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి .. పంచ సూత్రాలు

**రైతన్న మీకోసం కార్యక్రమంలో అధికారులు, నాయకులు**



**బండి ఆత్మకూరు, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్ర రైతాంగాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు పంచ సూత్రాల ప్రణాళిక పకడ్బందీగా చేపట్టింది. ఇందులో భాగంగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహించారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, తహసిల్దార్ పద్మావతి, ఎంపీడీవో గాయత్రి, పశువైద్యాధికారిని డాక్టర్ అనూష కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ వాటి అనుబంధ శాఖలతో కలిసి ప్రతిరోజు 92 కుటుంబాలను కలిసి వారి సంక్షేమానికి ప్రభుత్వం నిర్దేశించిన ఐదు సూత్రాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు వ్యవసాయ సాంకేతికత ఆహార శుద్ధి ప్రభుత్వ మద్దతు ధర గురించి రైతులకు వివరించి ఏపీ ఎంఎస్ యాప్ నందు జియో పెన్షన్ ద్వారా పకడ్బందీగా రైతుల వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని వారు సూచించారు. అలాగే మండల పరిధిలోని పెద్దదేవలాపురం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సిబ్బందితో పాటు స్థానిక టిడిపి నాయకులు మలిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొని రైతులకు సూచనలు చేశారు.

**అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు రైతుల ఖాతాల్లో జమ**

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మూడో విడత పంపిణీ అనంతరం అర్హులైన రైతులందరికీ రూ.6000 డిబిటి ద్వారా ఆధార్ కు లింకు ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని టిడిపి నాయకులు వివరించారు. అర్హత ఉండి లబ్ది పొందని రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తో పాటు మీ సేవలో ఆధార్ ఈకేవైసి, బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్ పీసీఐ లింకేజ్ చేయించు కోవాలని రైతులను ఏఓ పవన్ సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అక్షరాంధ్ర పరీక్షలు విజయవంతం - పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి**

**హాస్టళ్లలో గ్యాస్ కొరత లేదు**

**- వాట్సాప్ సేవలు, పి4 మానిటరింగ్, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి పెట్టాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, బ్యూరో మార్చ్ 16( రిపబ్లిక్ న్యూస్)**
జిల్లాలో నిర్వహించిన అక్షరాంధ్ర కార్యక్రమం పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు ముందు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, అన్ని శాఖల జిల్లాధికారులు పాల్గొన్నారు.

### అక్షరాంధ్ర పరీక్షలు విజయవంతం - అధికారులను అభినందించిన కలెక్టర్

జిల్లాలో మొత్తం 1,01,181 మంది అభ్యాసకులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,00,993 మంది హాజరై పరీక్ష రాశారని, కేవలం 88 మంది మాత్రమే గైర్హాజరయ్యారని వెల్లడించారు. తక్కువ సమయంలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన వయోజన విద్య, డిఆర్డిఏ, డ్వామా, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. అయితే విధులకు హాజరుకాని స్పెషల్ అధికారులకు మెమోలు జారీ చేస్తామన్నారు. అభ్యాసకుల మార్కులను ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తక్షణమే నిర్ణీత యాప్‌లో నమోదు చేసి వాట్సాప్ గ్రూపులో ధృవీకరించాలని ఆదేశించారు.

### పదో తరగతి పరీక్షలపై సమీక్ష

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మొత్తం 25,035 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, అందులో 15,000 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి, 10,035 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉన్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మెడికల్ క్యాంపులు వంటి కనీస వసతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద పారిశుధ్యం మరియు తాగునీటి సరఫరాను మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు.

### పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి

పరీక్ష గదులు విద్యార్థులకు అనుకూలంగా ఉండాలని, సరైన గాలి వెలుతురు ఉండేలా కిటికీలు, తలుపులు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమకు కేటాయించిన పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, పరిశుభ్రమైన టాయిలెట్లు, సరైన బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు ఉండేలా



చూడాలని తెలిపారు.

### విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఏ ఆర్టీసీ బస్సులోనైనా ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. పరీక్షలు ముగిసిన తర్వాత విద్యార్థులు ఎండలో నిలబడకుండా షెడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. 25 వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పరీక్షలు పునాది కావడంతో ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

### ఈ-ఆఫీస్ వ్యవస్థ అమలు

కోర్టు కేసులకు సంబంధించిన కౌంటర్, వకాలాత్ ఫైళ్లతో సహా అన్ని ఫైళ్లు ఇకపై ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిజికల్ కాపీలపై సంతకాలకు ముందు ఈ-ఆఫీస్‌లో అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీఓ మరియు కలెక్టర్ కార్యాలయాల మధ్య జరిగే ఫైళ్ల కదలికలు కూడా పూర్తిగా ఈ-ఆఫీస్‌లోనే ఉండాలని తెలిపారు.

### హాస్టళ్లలో గ్యాస్ సిలిండర్ల సరఫరాపై స్పష్టత

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, హాస్టళ్లకు సరిపడా సరఫరా ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 155 హాస్టళ్లను తహసీల్దార్లు తనిఖీ చేయాలని ఆదేశించారు.

### వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు

రాష్ట్ర ప్రభుత్వ వాట్సాప్ సేవల వినియోగంలో రాష్ట్రం 17వ స్థానంనుంచి 9వ స్థానానికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. 95523 00009 నంబర్‌కు "ఎఱ" అని మెసేజ్ పంపడం ద్వారా పార్సెల్ బుకింగ్, హాల్ టికెట్లు, మార్కుల వివరాలు వంటి అనేక సేవలను పొందవచ్చని వివరించారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యక్రమాల్లో పాల్గొనే వారు ఈ సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు.

### పి4 మానిటరింగ్ - మార్గదర్శి కార్యక్రమం

పి4 మానిటరింగ్‌లో భాగంగా మార్గదర్శులను 'బంగారు కుటుంబం'తో ట్యాగింగ్ చేయడం పూర్తిగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ప్రతినిధులు ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రతి మార్గదర్శికి ఒక బంగారు కుటుంబాన్ని కేటాయించడం 100 శాతం పూర్తి కావాలని స్పష్టం చేశారు.

### కౌశలం అసెస్‌మెంట్‌పై అసంతృప్తి

జిల్లాలో 49,931 మంది అర్హులలో కేవలం 10,324 మంది మాత్రమే స్కిల్ డెవలప్‌మెంట్ టెస్ట్‌కు హాజరుకావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారిలో 4,071 మంది మాత్రమే అర్హత సాధించారని తెలిపారు. మిగిలిన వారు ఎందుకు హాజరు కాలేదో అధికారులు సమీక్షించాలని ఆదేశించారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్, ఆరోగ్య సూచికలపై దృష్టి

మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు సాధించేందుకు క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. సెకండరీ హెల్త్ సూచికల్లో జిల్లా వెనుకబడి ఉందని, దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

### ఎల్ నినో ప్రభావం ముందస్తు చర్యలు

నంద్యాల జిల్లాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఐలాండ్ల వద్ద గ్రీన్ షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే ఉపాధిహామీ, పీఆర్ పనులపై కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

**పీజీఆర్ఎస్ ద్వారా 240 దరఖాస్తుల స్వీకరణ**

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 138 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

**నంద్యాల, బ్యూరోమార్చి 16 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా, వాటిని నిర్ణీత సమయంలో వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితర అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదులను అధికారులు బాధ్యతగా తీసుకొని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో పరిష్కరించాల్సిన 2,797 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే రీ-ఓపెన్ అయిన 293 దరఖాస్తులను వేగవంతంగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ఆడిట్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే వినతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, వాటిని ముందుగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని



సూచించారు.

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 138 అర్జీల స్వీకరణ

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 138 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి - 7, అడంగల్ సవరణలకు సంబంధించినవి - 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణకు సంబంధించినవి - 22, 22-ఎ భూములకు సంబంధించినవి - 8, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి - 24, రెవెన్యూ కోర్టు విచారణలు / ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 34, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి - 34, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి - 7 వచ్చాయని కలెక్టర్ వివరించారు.

### పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు

1) సంజామల మండలం రామభద్రపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరమ్మ తన తండ్రికి ఎనిమిది మంది సంతానం ఉన్నప్పటికీ, ముగ్గురు సంతానం అనుమతి లేకుండా నకిలీ సంతకాలతో కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం పొందుతూ ఆస్తి భాగాల పంపిణీకి ప్రయత్నిస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే భాగాల పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలని బనగానపల్లె ఆర్డీఓను ఆదేశించారు. అలాగే కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రంపై సమగ్ర విచారణ చేపట్టాలని సంజామల తహాశీల్దార్‌ను ఆదేశించారు.
2) పగిడ్యాల మండలానికి చెందిన జి. సువర్ణ తాను వైకల్యంతో బాధపడుతున్నానని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
3) బేతంచెర్ల మండలం బుగ్గనపల్లె గ్రామానికి చెందిన పుల్లన్న తన తండ్రి పేరు మీద ఉన్న పొలంలోకి మనవడు ప్రవేశించనీయకుండా అడ్డుకుంటున్నారని, అలాగే ఆ భూమిని డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేయడం వల్ల భూ లావాదేవీలు జరగడం లేదని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని బేతంచెర్ల తహాశీల్దార్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**






**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 16)**
కర్నూలు జిల్లాలో సోమవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలకు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ప్రశ్నపత్రాల రవాణాకు భద్రత కల్పిస్తూ ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని సెక్షన్ 144 అమలు చేస్తున్నందున గుంపులు గుంపులుగా ఎవరూ చేరకుండా పోలీసులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# ముజఫర్ నగర్‌లో తీవ్ర నీటి సమస్య

**10 సంవత్సరాలుగా పైప్‌లైన్ మార్పు కోసం విన్నపాలు**

**పట్టించుకోని అధికారులు 100 కుటుంబాలు ఇబ్బందులు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 16)**
కర్నూలు జిల్లా కల్లూరు మండలం ముజఫర్ నగర్ 33వ వార్డు 16వ లైన్‌లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సరైన నీటి సరఫరా లేకపోవడంతో సుమారు 100 కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.
ఈ సమస్యను పరిష్కరించమని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. పురమిత్రలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. గత సంవత్సరం గ్రీవెన్స్‌లో కూడా సమస్యను వివరించగా పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మా 16వ లైన్‌లో గత 10 సంవత్సరాలుగా పైప్‌లైన్ మార్చాలని కోరుతున్నామని, ప్రస్తుతం కేవలం 3 ఇంచుల పైప్ మాత్రమే ఉండడంతో నీటి సరఫరా సరిగా అందడం లేదని ప్రజలు తెలిపారు. అదే లైన్‌లో పైక్రింద కలిపి సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నీటిని వదిలే లైన్ మెన్ కూడా సరైన సమాధానం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. కాబట్టి జిల్లా కలెక్టర్ స్పందించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి తమ ప్రాంతంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ముజఫర్ నగర్ 16వ లైన్ ప్రజలు కోరారు.

# నంద్యాల హిందూ స్మశాన వాటిక స్వర్గధామం వెబ్ సైట్ ఆవిష్కరణ

**. వెబ్ సైట్ ప్రారంభించిన వెదుర్ల రామ చంద్ర రావు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ**

**స్వర్గధామం అభివృద్ధిలో నవనిర్మాణ సమితి సేవలు ప్రశంసనీయం: వెదుర్ల రామ చంద్ర రావు**

**. స్వర్గధామం స్మశాన వాటిక అభివృద్ధికి అందరూ సహకరించాలి: డాక్టర్ రామకృష్ణారెడ్డి.**

**. స్వర్గధామం స్మశాన వాటిక అందమైన బృందావనంలా తీర్చిదిద్దాము: డాక్టర్ మధుసూదనరావు**

**నంద్యాల మార్చి 16( రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన స్వర్గధామం హిందూ స్మశాన వాటికల వెబ్ సైట్ మధుమణి సమావేశ భవనంలో నవనిర్మాణ సమితి అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామ చంద్ర రావు, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి ప్రారంభించారు.

స్వర్గధామం వెబ్ సైట్ ను నంద్యాల నేషనల్ కంప్యూటర్స్ నిర్వాహకులు షణ్ముఖ శ్రీనివాస్, బోయిలకుంట్ల గ్రామ నివాసి సాయినాథ్ రెడ్డి సారథ్యంలో యువ సాంకేతిక ఇంజనీర్లు గౌసియా, లహరి, మణికుమార్ లు పూర్తి ఉచితంగా సేవా దృక్పథంతో రూపొందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ నంద్యాల ఆంజనేయ స్వామి దేవాలయం వెనుక ఉన్న స్మశాన వాటిక, పి.వి. నగర్ సమీపంలో ఉన్న స్మశాన వాటికలను పరిశుభ్రమైన, స్మశాన వాటికలుగా పట్టణ ప్రజల సహకారంతో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇక్కడ అందుతున్న సేవలు గురించి ఎక్కడ ఉన్న వారైనా తెలుసుకోవడం కోసం,వీటి అభివృద్ధి కొరకు సహాయం చేయ దలుచుకున్న వారికి అనువుగా వెబ్ సైట్ రూపొందించడం జరిగిందన్నారు. అనాథ శవాలకు పూర్తి ఉచితంగా సేవలను అందించడం జరుగుతున్నదని చెప్పారు.




రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి,ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్ర రావు మాట్లాడుతూ మృతి చెందిన ప్రతి హిందువు కు గౌరవంగా అంత్యక్రియలను నిర్వహించుకునే విధంగా స్వర్గధామం నిర్వాహకుల సేవలు ప్రశంసనీయమన్నారు.

రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వర్గధామం చేస్తున్న సేవలు వివిధ సోషల్ మీడియాల ద్వారా ప్రతి ఒక్కరికి తెలియవలసిన అవసరం ఉందన్నారు.స్వర్గధామం స్మశాన వాటిక అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి. రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల స్వర్గధామం పట్టణంలోనే కాకుండా పరిసర గ్రామాలకు కూడా సేవలు అందించడం అభినందనీయమన్నారు.

నవనిర్మాణ సమితి వ్యవస్థాపకులు శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ మృతదేహాలను భద్రపరచడానికి శీతలీకరణ కేంద్రాన్ని భవిష్యత్తు లో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల నవనిర్మాణ సమితి వ్యవస్థాపకులు శివకుమార్ రెడ్డి, పట్టణ ప్రముఖులు గెలివి రామకృష్ణ, శేషు బాబు, కశెట్టి కృష్ణమూర్తి, ప్రముఖ న్యాయవాది రావినూతల దుర్గాప్రసాద్, పరమేశ్వర రాజశేఖర్, దేవరశెట్టి శ్రీనివాసులు, ద్వారకా వసంత్, దాతలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ గెలిచిన సందర్భంగా సంబరాలు




**గుత్తి మార్చి 16 (రిపబ్లిక్ న్యూస్ )**
గుత్తి పట్టణ సోమవారం కోర్ట్ సమీపంలో హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ ,ఏపీ మెంబెర్. అఫ్ బార్ కౌన్సిల్ సభ్యుడు. గా యల మంజు బాలాజీ పోటీ చేసి గెలిచిన సందర్భంగా, అయన చిత్ర పటానికి పూలమాల వేసి సంతోషం వ్యక్తపరిచిన వడ్డెర మండల అధ్యక్షుడు పీట్ల చిరంజీవి మాట్లాడుతూ వడ్డెర కులస్తుడు బార్ కౌన్సిల్ సభ్యుడు గా గెలవడం చాలా సంతోష కరమని వడ్డెర కులస్తులు అన్ని రంగాలలో ముందుండాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో జైలర్, సూపర్డెంట్ మహేశ్వరుడు, న్యాయవాది సోమశేఖర్, సూర్యావంశ వడియారాజులు సంఘం నాయకులు, బత్తల మారుతి ప్రసాద్, చిరంజీవి, తిరుపతయ్య,, వెంకటరాముడు, నాగరాజు,టీడీపీ నాయకులు, మండల నాగరాజు, కృష్ణ, రాము,తదితరులు పాల్గొన్నారు

# ఎండలో కన్నుమూసిన నిరాశ్రయ వృద్ధురాలు

## మానవత్వం చూపిన ఆటో డ్రైవర్లు



**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 16, అనంతపురం**

సమాజంలో ఇంకా మానవత్వం మిగిలే ఉందని నిరూపించి హృదయాన్ని తాకే ఘటన అనంతపురంలో చోటుచేసుకుంది. నిరాశ్రయంగా జీవిస్తూ ఎండ వేడిని తట్టుకోలేక కన్నుమూసిన ఓ వృద్ధురాలికి స్థానికులు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి సహృదయాన్ని చాటుకున్నారు.

**"తాగడానికి నీళ్ల కోసం" ... ఆమె వేడుకున్న స్వరం**

అనంతపురం పోస్టాఫీస్ సమీపంలోని బస్ షెల్టర్ వద్ద సుమారు 70 సంవత్సరాల వయస్సున్న రాములమ్మ అనే వృద్ధురాలు చాలా కాలంగా ఆశ్రయం లేకుండా జీవించేది. చూపు లేకపోవడంతో ఆమె అక్కడే గడిపేది. మండే ఎండలోనూ, వానలోనూ ఇలా బస్ షెల్టర్‌నే తను ఆశ్రయంగా మార్చుకుని జీవనం సాగించేది."బాబూడ తాగడానికి కొంచెం నీళ్లు ఇవ్వండిడ" అంటూ ఆమె వేడుకునే స్వరం అక్కడి వారిని కలచివేసేది. ఆమె పరిస్థితి చూసి పోస్టాఫీస్ సమీపంలోని ఆటో స్టాండ్ డ్రైవర్లు, స్థానికులు తరచూ నీళ్లు, ఆహారం ఇచ్చి ఆమెను ఆదుకునేవారు. అయితే ఇటీవల మండుతున్న ఎండ వేడిని తట్టుకోలేక రాములమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఆమె మృతదేహం రెండు రోజుల పాటు ఎవరూ గమనించక పోవడంతో అక్కడే ఉండిపోయింది. బస్ షెల్టర్ సమీపంలో దుర్వాసన రావడంతో ఆటో స్టాండ్ వద్ద ఉన్న వారు గమనించి దగ్గరికి వెళ్లి చూడగా వృద్ధురాలు మృతి చెందిన విషయం తెలుసుకున్నారు. దీంతో ఐఎంఎం భాషకు సమాచారం అందజేశారు.

**మానవత్వంతో రాములమ్మకు అంత్యక్రియలు**

ఆమెకు బంధువులు ఎవరూ లేకపోయినాడ అక్కడున్న మనుషులు మాత్రం మానవత్వం చూపించారు. వెంటనే స్పందించిన ఆటో డ్రైవర్లు, స్థానికులు కలిసి రూ.3,100



చందా సేకరించారు. అనంతరం ఈ విషయాన్ని ఐఎంఎం ఆర్గనైజేషన్ సభ్యుడు మహబూబ్ బాషాకు తెలియజేశారు. ఐఎంఎం భాష ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించారు. మైనారిటీ కాంగ్రెస్ నాయకుడు నవాజ్ సాహెబ్ కూడా తన వంతు సహాయం అందించారు. అనంతరం చెరువుకట్ట వద్దనున్న సాయిబాబా దేవస్థానం సమీపంలో గాల స్మశాన వాటికలో రాములమ్మకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్‌కు చెందిన అల్లాబకాష్, చోటు వలి, రఫీ, వన్నూరు భాష తదితరులు పాల్గొన్నారు. కులం, మతం, జాతి అనే భేదాలు లేకుండా మానవత్వంతో ముందుకు వచ్చి రాములమ్మ అంత్యక్రియలు జరిపారు.

# మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల పెంపుకు గ్రీన్ సిగ్నల్

## ఇన్చార్జి ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ శంకర్

**అనంతపురం వైద్యం, మార్చి 16,(రిపబ్లిక్ న్యూస్):**



ప్రభుత్వ వైద్య కళాశాల విద్యాభివృద్ధిలో మరో అడుగు ముందుకు పడింది. ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్ల పెంపునకు సంబంధించి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రత్యేక తనిఖీ నిర్వహించింది. ఈ తనిఖీలో విభాగాల పనితీరు, మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను కమిటీ సమగ్రంగా పరిశీలించింది. తనిఖీ అనంతరం రెండు విభాగాల పనితీరు పట్ల కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు మెడికల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ శంకర్ తెలిపారు. ఈ తనిఖీ కమిటీలో కర్నూలు మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ కె. శ్రీనివాస్, అలాగే కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ కె. విజయ ఆనందబాబు పాల్గొన్నారు.

**జాతీయ వైద్య మండలి ఆమోదం లభిస్తే... పీజీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం...**


ప్రస్తుతం కళాశాలలో ఆర్థోపెడిక్స్ విభాగంలో 7 పీజీ సీట్లు, పీడియాట్రిక్స్ విభాగంలో 8 పీజీ సీట్లు ఉన్నాయి. వీటికి అదనంగా ఆర్థోపెడిక్స్ లో 5 సీట్లు, పీడియాట్రిక్స్ లో మరో 4 సీట్లు పెంపునకు కళాశాల యాజమాన్యం చర్యలు చేపట్టింది. యూనివర్సిటీ తనిఖీ నివేదిక అనుకూలంగా ఉంటే నేషనల్ మెడికల్ కమిషన్ కు సీట్ల పెంపుదల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు.జాతీయ వైద్య మండలి ఆమోదం లభిస్తే రెండు విభాగాల్లో పీజీ సీట్ల సంఖ్య 12 వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. దీనివల్ల జిల్లాలో వైద్య విద్యకు మరింత ప్రోత్సాహం లభించడమే కాకుండా, నిపుణులైన వైద్యుల సంఖ్య పెరగడం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ మేడ ఆత్మారామ్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ రవికుమార్, ప్రొఫెసర్ డాక్టర్ సతీష్, డాక్టర్ మహమ్మద్ గౌస్, డాక్టర్ ప్రవీణ్ దీన్ కుమార్, డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ బాబ్జాన్ తదితర వైద్యులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా రైల్వే సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రస్తావన

## పంచలింగాల మిడ్ లైఫ్ కోచ్ ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

## కర్నూలుమంత్రాలయం కొత్త రైల్వే లైన్, పలు రైలు సర్వీసులపై కేంద్రానికి విజ్ఞప్తి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 16)**



కర్నూలు జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలను పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రస్తావించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో భాగంగా 202526 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌పై జరిగిన డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ చర్చలో ఆయన మాట్లాడారు.పంచలింగాల గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వే మిడ్ లైఫ్ కోచ్ ఫ్యాక్టరీ పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు.అదేవిధంగా కర్నూలు నుంచి మంత్రాలయం వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, అలాగే కర్నూలు నుంచి విజయవాడకు నేరుగా రైలు సర్వీసులు ప్రారంభించాలని సూచించారు. విశాఖపట్నం నుంచి మహబూబ్‌నగర్ వరకు నడుస్తున్న ఎస్.ఎఫ్ రైలును కర్నూలు వరకు పొడగించాలని కూడా ఆయన కోరారు.ఇక ఆదోని, మద్దికెర, తుగ్గలి రైల్వే స్టేషన్లలో నిలిపివేసిన రైళ్ల హాల్ట్‌లు, స్టాప్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు వేస్తున్న డబుల్ ట్రాక్ పనులను త్వరగా పూర్తి చేయాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు.

# ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి - ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు

## జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులకు సూచనలు జారీ చేసిన డిఆర్ఓ వెంకటనారాయణమ్మ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 16)**

జిల్లాలో కొనసాగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ సూచించారు.సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎండల తీవ్రతను ఎదుర్కొనే చర్యలపై జిల్లా సమన్వయ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎండల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీలలోని ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ప్రజలకు నీడ సౌకర్యం కల్పించాలని, ప్రధాన బస్టాండ్లు మరియు బస్ షెల్టర్లలో త్రాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.డీడబ్ల్యూఎంఏ, డీఆర్డీఏ పనుల్లో పాల్గొనే కార్మికులు, వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కార్మికులకు పనిచేసే ప్రదేశాల్లో త్రాగునీరు, మజ్జిగ, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.




గ్రామ, వార్డు సచివాలయాలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దేవస్థానాల్లో భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, నీడ వసతులు కల్పించాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలో పనులు చేయకుండా చూడాలని సూచించారు. అగ్నిమాపక కేంద్రాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి అగ్నిప్రమాదాలను నివారించేందుకు అవసరమైన పరికరాలు, నీరు, సిబ్బంది సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

గ్రామాల్లో గడ్డివాముల వద్ద మంటలు వ్యాపించకుండా నీటి సౌకర్యం కల్పించాలని, పొలాల్లోని బావులు, చెరువులు, మైనింగ్ వల్ల ఏర్పడిన నీటి కుంటల వద్ద పిల్లలు స్నానాలు చేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు అటవీశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యమైన ప్రదేశాల్లో వడదెబ్బకు గురైన వారికి తక్షణ చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రతిరోజూ సాయంత్రం 3 గంటలలోగా డైలీ స్టేటస్ రిపోర్టును కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని డిఆర్ఓ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి సురేష్ కుమార్, డీఎంహెచ్ఓ భాస్కర్, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, జేడీ వ్యవసాయం వరలక్ష్మి, కర్నూలు మున్సిపల్ అదనపు కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎండోమెంట్స్ ఏసీ సుధాకర్ రెడ్డి, డ్వామా పీడీ మాధవిలత, జిల్లా ఫైర్ అధికారి భరత్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, మండల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకి ఘన నివాళులు

## పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలి - అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

## అమరజీవి ఆంధ్రకే కాదు దేశానికి ఒక స్ఫూర్తిప్రదాత -జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం జెడ్పీ, మార్చి 16,(రిపబ్లిక్ న్యూస్):**

నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని డిపిఆర్సి భవనంలో సోమవారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, అనంతపురం మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బల్లాపల్లవి, డిఆర్ఓ ఏ.మలోల, రాప్తాడు జడ్పిటిసి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్, జడ్పి చైర్ పర్సన్, ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు, తదితరులు ఘన నివాళులు అర్పించారు.

**అమరజీవి కాంస్య విగ్రహం ఏర్పాటుకు ప్రాధాన్యత**

కూటమి ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్యవిగ్రహం ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో రాజధాని అమరావతిలో శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించగా, కార్యక్రమన్ని లైవ్ ద్వారా వర్చువల్ విధానంలో వీక్షించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు తలపెట్టగా, 6.80 ఎకరాల స్థలంలో మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం 6 నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. విగ్రహాన్ని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



**స్మృతి వనం ఏర్పాటు కోసం 6.80 ఎకరాల స్థలం**

ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు గారి గౌరవార్థం 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆవిష్కరించారని తెలిపారు. విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు కోసం ప్రభుత్వం 6.80 ఎకరాల స్థలాన్ని కేటాయించడమే కాకుండా, దాదాపు 150 కోట్ల రూపాయల ఖర్చుతో ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు గారి త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మరియు ఇతర మంత్రుల సహకారంతో ఈ కార్యక్రమం బ్రహ్మాండంగా జరుగుతోందని కొనియాడారు.

**ఆయన పోరాటం వల్లే మనమంతా ఈ స్థితిలో ఉన్నాం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్న పేరు వినగానే తనకు మొదట గుర్తొచ్చే పేరు అమరజీవి పొట్టి శ్రీరాములు గారు అని, ఎందుకంటే, మన సోషల్ సైన్స్ టెక్స్ట్ బుక్స్‌లో 'రాష్ట్రాల పునర్విభజన ఎలా జరిగింది?' అనే పాఠంలో ఆయన గురించి ఉండేదని గుర్తుచేసుకున్నారు. పొట్టి శ్రీరాములు కేవలం ఆంధ్రకే కాదు, భారతదేశం మొత్తానికి ఒక స్ఫూర్తిప్రదాత అని, దేశం గర్వించదగ్గ వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు పూర్వీకుల ఊరైన పడమటిపల్లి ప్రాంతంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం మేము ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశామని, ప్రభుత్వం కూడా దీనిపై చాలా ఆసక్తిగా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన విభజించాలా లేక పరిపాలనా సౌలభ్యం కోసమా అనే సందిగ్ధంలో ఉన్నప్పుడు, 'భాష' అనేది ప్రజలను కలిపి ఉంచే ఒక బలమైన శక్తి అని పొట్టి శ్రీరాములు నిరూపించారన్నారు. భాష తెలిస్తేనే అక్కడి సంస్కృతి అర్థమవుతుందని, ఆయన చేసిన పోరాటం వల్లే నేడు మనమంతా ఈ స్థితిలో ఉన్నామన్నారు. దయచేసి అందరూ కూడా ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అందరికీ పొట్టి శ్రీరాములు జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

**పొట్టి శ్రీరాములు నిస్వార్థంగా పోరాడి ప్రాణాలు వదిలారు**

ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, అనంతపురం మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బల్లాపల్లవి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, 58 రోజులుపాటు నిరాహారదీక్ష చేసి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేయడంతో తెలుగు వారికంటూ ఒక రాష్ట్రం ఏర్పడటం జరిగిందన్నారు. పొట్టి శ్రీరాములు లాంటి మహనీయుల చరిత్ర భావితరాలకు తెలియాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ఏ.మలోల మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని అమరజీవి పొట్టి శ్రీరాములు నిస్వార్థంగా పోరాడి ప్రాణాలు వదిలారన్నారు. ఇటువంటి మహనీయుల త్యాగం ఫలించాలంటే అందరం కలిసి ఉండాలన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ప్రభుత్వం రాష్ట్ర కార్యక్రమంగా ఏర్పాటు చేసిందని, ఆయన స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, అన్సెట్ మేనేజర్ ఎం.శ్రీనివాసులు, సూపరింటెండెంట్ అన్వర్ భాష, నాయకులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా- పేద కుటుంబాలకు ఆశాకిరణం

## గౌసర్ పల్లి మహమ్మద్ రఫీ చేతుల మీదుగా సరుకుల పంపిణీ



**అనంతపురం సంక్షేమం, మార్చి 16 (రిపబ్లిక్ న్యూస్):**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు సహాయం అందిస్తూ గౌసర్ పల్లి మహమ్మద్ రఫీ మానవతా విలువలను చాటుకున్నారు. సోమవారం సాయంత్రం హెచ్ఎల్‌సి కెనాల్ సమీపంలోని ఓ భవన ప్రాంగణంలో ఐదు పేద ముస్లిం కుటుంబాలకు "రంజాన్ తోఫా"గా అత్యవసర నిత్యావసర సరుకులను అందజేశారు.

**పండుగ సంతోషం అందరికీ చేరాలనే ఉద్దేశంతో ఈ సహాయం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సద్వినియోగం చేసుకుంటూ పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పండుగ సంతోషం అందరికీ చేరాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆయన మిత్రులు చంద్రశేఖర్, భాషా కూడా పాల్గొన్నారు. తోఫా కనుక అందుకున్న కుటుంబాలు గౌసర్ పల్లి మహమ్మద్ రఫీకి కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా పేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో నావంతు సాయం అందించానన్నారు.

# పదవ తరగతి పరీక్ష విధుల్లో గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు అన్వర్ బాషా మృతి

**ఓర్వకల్లు ప్రతినిధి మార్చి 16, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



సోమవారం రోజునపదవ తరగతి పరీక్ష విధులు నిర్వహిస్తున్న సమయంలో నిజ్జూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ అన్వర్ బాషా అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. 2009 నుంచి ప్రధానోపాధ్యాయుడిగా సేవలందిస్తూ ఏ దిగువపాడు, శకునాల, ఉయ్యాలవాడ పాఠశాలల్లో తనదైన ముద్రవేశారు. ఆయన మృతితో జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం కర్నూలు జిల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

# ఆత్మగౌరవానికి ప్రతిరూపం .. అమరజీవి త్యాగం

## జయంతి సందర్భంగా మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ఘన నివాళులు

**అనంతపురం సంక్షేమం, మార్చి 16,(రిపబ్లిక్ న్యూస్):** తెలుగువారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఈరోజు ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారంటే... దానికి మొదట బీజం వేసింది ఆనాడు పొట్టి శ్రీరాములని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివ సత్యకుమార్ యాదవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టవర్ క్లాక్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**రాష్ట్రం అగ్రగామిగా ఉందంటే.. పొట్టి శ్రీరాములు సాధన**

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని మొట్టమొదట పోరాడింది పొట్టి శ్రీరాములు



అన్నారు. ఆయన పోరాటం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, ఆ తర్వాత మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ సహా అనేక భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని.. వారి ఆస్తిత్వాన్ని కాపాడుకునే దిశగా వారు పోరాటం చేశారన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందంటే అది ఆ రోజు పొట్టి శ్రీరాములు రాష్ట్ర సాధన వలనేనన్నారు. ఆర్యవైశ్యులు ఎక్కడ ఉన్నా.. ఆర్థికంగా రాణిస్తూ చాలా లో ప్రొఫైల్ మెయింటైన్ చేస్తున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వారు బలమైన పాత్ర పోషిస్తున్నారన్నారు.

**దేవాలయ ప్రవేశ హక్కు కోసం చేసిన ఉద్యమం ప్రత్యేకం**

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారికి ఒక రాష్ట్రం ఉండాలని పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ప్రాణాన్ని పణంగా పెట్టి.. రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆ మహానీయుని త్యాగం గుర్తుండేలా ఈ ప్రభుత్వం చొరవ తీసుకుందని.. ఇందులో ఆర్యవైశ్య సంఘాన్ని కూడా భాగస్వామ్యం చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో పాటు ఆయన దళితుల గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడారని గుర్తు చేశారు. దేవాలయ ప్రవేశ హక్కు కోసం చేసిన ఉద్యమం ప్రత్యేకంగా నిలిచిందని.. ఆయన పోరాటం సమాజంలోని ప్రతి వర్గం కోసం అన్న విషయం ఆరోజే అర్థమైందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీగా నిలుస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో నిఘా

## బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారి పై కేసులు నమోదు





**నంద్యాల క్రైం , మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలు మేరకు జిల్లా వ్యాప్తంగా అటవీ పరిసర ప్రాంతాల్లో , గ్రామ/ పట్టణ శివారు ప్రాంతాలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసేందుకు, చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక డ్రోన్ పర్యవేక్షణ నిర్వహించింది. గ్రామ / పట్టణ శివారు ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు, ప్రజా భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సోమవారం నంద్యాల తాలూకా, నంద్యాల వన్ టౌన్, జూపాడుబంగ్లా మొదలగు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ ద్వారా పరిశీలించగా కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించుచుండగా వారిని గుర్తించి కేసులో నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇటువంటి డ్రోన్ పర్యవేక్షణలు తరచుగా నిర్వహించడం ద్వారా జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక , నేర కార్యకలాపాలను అరికట్టడం జరుగుతుందని, మీ చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 75 ఫిర్యాదులు

## విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తాం -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

**నంద్యాల క్రైం, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదులలో కొన్ని**

1).బనగానపల్లె గ్రామానికి చెందిన గోపాల్ అను వ్యక్తి బియ్యం వ్యాపారం చేస్తున్నానని నన్ను నమ్మించి బియ్యం బస్తాలు తీసుకొని వెళ్లి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు నాకు న్యాయం చేయండని వెలుగోడు



గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

2).నాకు సంబంధించిన రెండు ఎకరాల పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి పొలం దగ్గరికి వస్తే చంపుతానని మహాపతిరావు, రమేష్, యశోద, అనువారు బెదిరిస్తున్నారని నాకు న్యాయం చేయండని కరివేన గ్రామానికి చెందిన జయమ్మ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

3).నా ఇంటిని నరేష్ అనే వ్యక్తికి బాడుగకు ఇవ్వడం



జరిగింది. 11 నెలలుగా బాడుగ ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని న్యాయం చేయండని బిలకలగూడూరు గ్రామానికి చెందిన సుధాకర్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

4).అయ్యలూరుమెట్ట నందు నూతనంగా నిర్మించుచున్న హెబ్రోన్ ప్రేయర్ హౌస్ ప్రార్థన మందిరం నందు సుమారు 1,20,000/- విలువచేసే కరెంటు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుని పోయినారని న్యాయం చేయండని పాస్టర్ ప్రసన్నకుమార్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.


# ఉగాది బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి.

**పాణ్యం. ప్రతినిధి మార్చి 16. (ప్రజారిపబ్లిక్ న్యూస్)**



ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం యొక్క ఉగాది బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డిలు సోమవారం ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి యం.రామక్రిష్ణ, ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షులు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ సిబ్బంది మొదటిగా కర్నూలు లోని ఎమ్మెల్యే వారి స్వగృహ కార్యాలయము నందు మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేష వస్త్రములు, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఈనెల 19 నుండి 21 వరకు జరుగు ఉగాది బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరు సుబ్బారాయుని ఉగాది బ్రహ్మోత్సవముల యందు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాములు




**నంద్యాల, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్)**

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు-డా. రంజిత్ కుమార్, +. శ్రీధర్ బాబు, ా. రామకృష్ణ, ూ. సురేంద్ర కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం నంద్యాల పట్టణంలోని సంజీవ నగర్ గేట్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నంద్యాల నందనం క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అవుకు మండలంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య సజావుగా టెన్త్ పరీక్షలు

**అవుకు ఫిబ్రవరి 16 రిపబ్లిక్ (న్యూస్)**

నంద్యాల జిల్లా అవుకు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శ్రీధర్ రావు తెలిపారు. ఈ పబ్లిక్ పరీక్షలకు మొత్తం 570 మంది విద్యార్థులు నమోదు కాగా, అందులో 553 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స వంటి అవసరమైన సదుపాయాలను కల్పించినట్లు వెల్లడించారు. అలాగే ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు మెడికల్ ఎమర్జెన్సీ సేవలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు పరీక్షలు ప్రశాంతంగా,



పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారుమండలంలోని అన్ని పరీక్షా కేంద్రాలలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పరీక్షలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు



**విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన**

పరీక్షలు జరుగుతున్న సమయంలో కొందరు ప్రైవేట్ స్కూల్ అధ్యాపకులు పాఠశాల పరీక్షా కేంద్రాల ఆవరణలోకి వెళ్లడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సమయంలో ఎవరూ అనవసరంగా కేంద్రాల్లోకి ప్రవేశించకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# మహా వైభవంగా నందీశ్వర ప్రదోషకాల అభిషేకం

## పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు





**మహానంది, మార్చి 16, (రిపబ్లిక్ న్యూస్)**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలోని మహానందీశ్వర స్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న శ్రీ నందీశ్వర స్వామికి ఫాల్గుణ మాసం బహుళ త్రయోదశి, మహాప్రదోషం సందర్భంగా సోమవారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ముఖ్య అర్చకులు ముందుగా గణపతి పూజ, పీఠార్చన, ద్రవ్య పూజలు చేశారు. నందీశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో, పంచామృతం, గంగాజలం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు జలాభిషేకం, పాలాభిషేకం పూజలు జరిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా నందీశ్వర అభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు నందీశ్వర అభిషేకం తిలకించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

**పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు**

మహానందిలో సోమవారం రాత్రి పల్లకి సేవ కన్నుల పండుగగా జరిగింది. వేద పండితులు, అర్చకులు శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను పుష్ప మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతుల అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువు తీర్చి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం చేపట్టారు.



ఉత్సవం అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను యాగశాలకు చేర్చారు. రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ఏకాంత సేవ పూజలు జరిపారు.

# ఘనంగాపొట్టి శ్రీరాములు జయంతి

## తాసిల్దార్ యామిని.



**ఓబులవారిపల్లి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్** మండల కేంద్రం ఓబులవారిపల్లె లోని తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా వేడుక నిర్వహించారు ఈ వేడుక తాసిల్దార్ యామిని ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా తాసిల్దార్ యామిని మాట్లాడుతూ భాష సంయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు మన పొట్టి శ్రీరాములు అని ఈ సందర్భంగా ఆయన స్మృతులను గుర్తు చేశారు, డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు గతంలో మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉండడం వలన తెలుగు వారికి ఒక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష 58 రోజులపాటు దీక్ష చేసి తెలుగు రాష్ట్రాన్ని సాధించిన మహా ఘనుడు పొట్టి శ్రీరాములు అని ఈ సందర్భంగా ఆయన్ను గుర్తు చేసుకోవడం మన అదృష్టమని అన్నారు,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 19శీ1వ సంవత్సరం మార్చి 16న నెల్లూరు జిల్లాలో పొట్టి శ్రీరాములు జన్మించారని, 1952 అక్టోబరు 19న తెలుగు వారికి ఒక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష 58 రోజులపాటు చేసి రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించి తెలుగు రాష్ట్రాన్ని సాధించి తెలుగువారికి జీవనజ్యోతి ల పొట్టి శ్రీరాములు నిలిచారని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ న్నామన్నారు.

ఈ కార్యక్రమం లో సీనియర్ అసిస్టెంట్ సాయిరాఘవేంద్ర జూనియర్ అసిస్టెంట్ ధరణి, బొమ్మ వరం వీఆర్వో అంబారపు శ్రీనివాసులు, గాదెల నూకనపల్లె వీఆర్వో శంకరయ్య చిన్నఓరంపాడు వీఆర్వో రాంబాబు, ఓబులవారిపల్లి విఆర్ఓ షేక్ భాను ఆఫీసు సిబ్బంది తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో ఎం వి ఎన్ రాజేంద్ర ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు ఎంపీడీవో రాజేంద్ర డిప్యూటీ ఎంపీడీవో రామ్మోహన్ రెడ్డి తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకను మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె సచివాలయ సెక్రటరీ బాలసుబ్రమణ్యం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేశారు ఎంపీడీవో రాజేంద్ర మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భాషా సంయుక్త రాష్ట్రాల కోసం ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయకత్వంలోనే మైనారిటీల సంక్షేమం

**రూ.6000 కోట్లు పైగా కేటాయించిన రాష్ట్రం ఏపీనే -గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా**

**కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ లను పూర్తి చేయని గత ప్రభుత్వం -రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు సమావేశంలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతి,మార్చి16( రిపబ్లిక్ న్యూస్) :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి నేటి వరకు ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యలతో కూడిన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం విజయవాడ ఏ- కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రస్థాయితో పాటు, అన్ని జిల్లాలలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏ-కన్వెన్షన్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన ముస్లిం మైనారిటీలను ఉద్దేశించి మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రసంగించారు. రాష్ట్రం కోసం,రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని, ఈ ఘనత చంద్రబాబుకి దక్కుతుందని అన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుకు రూ. 1.50కోట్లు నిధులు విడుదల చేసిన ఘనత కూడా చంద్రబాబుదే నని అన్నారు.



**మైనారిటీ కుటుంబాలకు అండగా "తల్లికి వందనం"**
రాష్ట్రంలో అమలవుతున్న తల్లికి వందనం పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక కుటుంబాల్లోని పిల్లల చదువుకు విశేషంగా లబ్ధి చేకూరుతోందని మదనపల్లెలో తనకు ఎదురైన ఒక ప్రత్యక్ష ఉదాహరణ అంశాన్ని మంత్రి ఫరూక్ సమావేశంలో వెల్లడించారు. ఏ ప్రభుత్వంలో మైనారిటీలకు మేలు జరిగిందన్న విషయాన్ని మైనారిటీలందరూ గుర్తించి గుండెల్లో పెట్టుకోవలసిన అవసరం ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. మదనపల్లెలో తాను ఒక సమావేశానికి హాజరు అయిన నేపథ్యంలో ఒక ముస్లిం వ్యక్తి వచ్చి తనకు దండ వేశారని, నాకెందుకు వేస్తున్నారని అడగగా.. తనకు 12 మంది పిల్లలు.. అందులో 6 మందికి తల్లికి వందనం మంజూరు అయిందని చెప్పి సంతోషం వ్యక్తం చేశారన్నారు. దీన్నిబట్టి తల్లికి వందనం పథకం తో మైనారిటీలు, పేదలు, శ్రామిక కుటుంబాలలోని పిల్లలకు ఎంత మేలు జరిగిందన్న విషయం, చదువుకు ఇచ్చిన ప్రాధాన్యత నెరవేరిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మంత్రి ఫరూక్ అన్నారు. ఏపీలో మైనారిటీల సంక్షేమం కోసం రూ. 6000 కోట్ల బడ్జెట్ ను కేటాయించిన ఘనత దేశం లోని ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ. 3000 కోట్లతో మైనారిటీల సంక్షేమం కు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నాంది పలికిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు.

**గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా**
2019-2024 గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి ఒక్క పైసా ఖర్చు చేయలేదని, అభివృద్ధి సున్నా అని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజమెత్తారు. టిడిపి ప్రభుత్వంలో 342 షాదిఖానాలు నిర్మించడం జరిగిందన్నారు. అయితే కేవలం రెండు షాదీఖానాలను మాత్రమే గత ప్రభుత్వం నిర్మించిందని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం విజయవాడలో హౌస్ కు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ కు, కడపలో హజ్ హౌస్ కు నిధులు కేటాయించి దాదాపుగా నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సొంత ఊరు పులివెందులలో కూడా షాది ఖానా నిర్మించలేదని, కడపలో హజ్ హౌస్, గుంటూరులో క్రిస్టియన్ భవన్ ల నిర్మాణాలను కూడా పట్టించుకోకుండా, పెండింగ్ పనులను పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం, ఉపాధి కోసం ఆటోనగర్ లను ఏర్పాటు చేసి, భూములు కేటాయించిన ఘనత కూడా చంద్రబాబు దేన ని అన్నారు. నంద్యాల, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆటోనగర్ లు చంద్రబాబు హయాంలోనే ఏర్పాటు అయిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో 49,161 మంది ఉపాధి కోసం రూ.280 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మైనారిటీ యువత శిక్షణ కోసం 41088 మందికి రూ. 53.89 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. మైనారిటీలందరూ గుండె మీద చేయి వేసుకొని ఏ ప్రభుత్వమైతే తమ సంక్షేమానికి కృషి చేసిందో, ఆ ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. రంజాన్ కు ఒకరోజు ముందు హిందువుల పర్వదినం ఉగాది, మరుసటి రోజు రంజాన్ పర్వదినాల సందర్భంగా మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు,ముస్లిం లందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలను రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు


---

# "గోలు అండ్ పప్పా - ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్"

# పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**పుస్తక రచయిత డాక్టర్ జావేద్ కు అభినందన**

**అమరావతి, మార్చి16 (రిపబ్లిక్ న్యూస్):**
విజయవాడలోని ఏ- కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన రాష్ట్రస్థాయి దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమంలో "గోలు అండ్ పప్పా - ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.ఈ పుస్తకంలో ప్రథమ చికిత్స ( ఫస్ట్ ఎయిడ్ )గురించి అందరికీ అర్థమయ్యేలా కథల రూపంలో చక్కగా వివరించినందుకు పుస్తక రచయిత డాక్టర్.జావేద్ అష్రఫ్ ను చంద్రబాబు అభినందించారు.న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇంటా బయట ప్రమాదాలు లేదా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిపుణుడైన డాక్టర్ దగ్గరకు లేదా ఆసుపత్రికి తీసుకెళ్లేదాక పేషంటును రక్షించడానికి అవసరమైన ప్రథమ చికిత్సను కథల రూపంలో పిల్లలకు వివరించడం చాలా బాగుందన్నారు.ఈ పుస్తకం ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరి దగ్గర



ఉండవలసిన పుస్తకమని అన్నారు. ఈ పుస్తకం చదివిన వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి ఇంటి వారిని బయటివారిని రక్షించడానికి ముందుకువస్తారన్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ జావేద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నవైపోయాయని, ఏదైనా జరిగితే ఆదుకునే వాళ్లు కరువైనారని, అలాగే సరైన అవగాహనలేనందువల్ల దారిలో ఎవరైనా పడిపోతే ఏమిచేయాలో తెలియక చాలామంది ప్రేక్షకులుగా ఉండిపోతున్నారని అన్నారు.అందువల్ల ప్రజల్లో ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంపొదించి వారు అవసరమైనపుడు తమ వాళ్లకు, ఇతరులకు సహాయపడేలా చూడాలనే ఉద్దేశ్యంతోనే తాను అందరికీ అర్థమయ్యేలా కథలరూపంలో ప్రథమ చికిత్సపై ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందని పేర్కొన్నారు.తన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి ఫరూక్ లకు డాక్టర్ జావేద్ కృతజ్ఞతలు తెలిపారు.

---

# ఎపిలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం

**గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు**

**అర గంట ముందుగానే లోపలికి అనుమతి**

**క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి**

**విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్**



**అమరావతి, మార్చి16 (రిపబ్లిక్ న్యూస్):**
ఎపిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నాడు ప్రారంభం అయ్యాయి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను వారి తల్లి తండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు వెంట వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. బస్సులో, ఆటోల్లో, బైక్ లు మీద తల్లి తండ్రులు, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు హాల్ టికెట్స్ నెంబర్ ఆధారంగా రూం కేటాయింపు చూసుకున్నారు. అనంతరం అరగంట ముందు విద్యార్థులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్థులు దగ్గర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయా అనేది చెక్ చేసి పరిశీలించి లోపలికి పంపించారు. బాలురకు పురుషులు, బాలికలకు స్త్రీ సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల హాల్ టికెట్ చూపించి, ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు ఉచితంగా చేరుకోవచ్చు. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.విద్యార్దులు వెంట వచ్చిన తల్లి తండ్రులు,ఉపాధ్యాయులు స్నేహితులు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ వారికి ధైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతంగా ఉండండి అంటూ విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. ఈ పరీక్షల్లో 100 శాతం మీ ప్రతిభను ప్రదర్శించే సమయం ఇదని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాయండంటూ వారికి ఆయన స్పష్టం చేశారు. విజయం మీదే. ఆల్ ది బెస్ట్ అంటూ వారికి మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా 10వ తరగతి విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు.

---

# చిరస్మరణీయులు అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు

**త్యాగధనుడికి వైయస్ఆర్‌సీపీ నాయకుల ఘన నివాళి.. -తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం..**

**ఏపీ బ్యూరో, మార్చి 16 - (రిపబ్లిక్ న్యూస్) -**
తెలుగుజాతి ఒక్కటిగా కలిసుండాలని, తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా గుర్తింపు, వారికి ఒక రాష్ట్రం కావాలని తలంచి, అందుకు తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు తెలుగుజాతి ఉన్నంత వరకు చిరస్మరణీయంగా నిలిచి పోతుందని వైయస్ఆర్‌సీపీ ముఖ్య నేతలు అన్నారు. సోమవారం తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్‌సీపీ పలువురు నేతలు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు మహనీయుడి పేరు పెట్టడం ద్వారా నవంబర్ 1వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా వైయస్ జగన్ పొట్టి శ్రీరాములును గౌరవిస్తే, చంద్రబాబు మాత్రం అనుక్షణం వారిని అవమానించారన్నారు. నవంబరు 1న జరిగే రాష్ట్ర అవతవరణ దినోత్సవాన్ని, రాష్ట్రాన్ని విభజించిన జూన్ 2వ తేదీకి మార్చి ఆ మహనీయుడిని అవమానించాడని వైయస్ఆర్ సీపీ నాయకులు గుర్తు చేశారు. అంతే కాకుండా ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు రూ.1750 కోట్లు వెచ్చిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం శ్రీ పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహానికి, ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కేటాయించకుండా చిన్న చూపు చూసిందని వెల్లంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులను వ్యాపారాలు చేసుకోనివ్వకుండా జీఎస్టీ తనిఖీల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని ఆక్షేపించారు.



**విలువలు, విశ్వసనీయతకు జగన్ ప్రతిరూపం..లేళ్ల అప్పిరెడ్డి**
దేశ చరిత్రలోనే భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి, 58 రోజులుఆమరణ నిరాహార దీక్ష చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని నిజానికి అలాంటి గొప్ప వ్యక్తి, దేశంలోనే కాదు. ప్రపంచంలోనే ఎక్కడ ఉండరని అలాంటి మహనీయుడి జయంతిని ఈరోజు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమంతా ఘనంగా నిర్వహిస్తోందని ఆ మహానుభావుడి ఆలోచనలు, ఆశయాలు కానీ చాలా గొప్పవని రాష్ట్రం కోసం శాంతియుతంగా ఆమరణ దీక్ష చేయడం చాలా త్యాగనిరతి అని రాష్ట్రం కోసం ఆయన చేసిన దీక్ష, ప్రాణత్యాగం ఎప్పటికీ మర్చిపోలేనిదని ఆయనను తల్చుకున్నప్పుడల్లా ప్రతి ఆంధ్రుడి హృదయం చలిస్తుందన్నారు. ఇప్పుడు రాజకీయాల్లో కొందరు నాయకులు మాటలు, చేతలు చూస్తుంటే, ఆశ్చర్యం కలుగుతుందని అధికారమే పరమావధిగా వాళ్లు చేస్తున్న రాజకీయాలు అనైతికమని ఆ మహనీయుడు పొట్టి శ్రీరాములు ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పని చేస్తున్నారని అది రాష్ట్రంపై, ప్రజలపై జగన్‌కి ఉన్న చిత్తశుద్ధని అలాగే విలువలు, విశ్వసనీయతకు జగన్ ప్రతిరూపంగా నిలుస్తున్నారన్నారు.

**ఆ మహనీయుడి త్యాగనిరతిని అందరూ అనుసరించాలి..మల్లాది విష్ణు..**
అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయనకు ఇవే ఘన నివాళులని భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం, తెలుగుజాతికి ప్రత్యేక రాష్ట్రం కోరుతూ, 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఆ మహనీయుడి త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ అనుసరించాలి. ఆచరించాలి. నాడు గాంధీని స్ఫూర్తిగా తీసుకుని పొట్టి శ్రీరాములు జీవించారు. సబర్మతి ఆశ్రమంలో కూడా ఉన్నారు. ఆయన తన జీవితంలో అయిదుసార్లు నిరాహార దీక్ష చేశారు. వాటిలో చివరిది భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం చేసిన దీక్ష. ఆయన ప్రాణ త్యాగం తర్వాతే, దేశంలో తెలుగుతో సహా, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. కానీ నేడు రాష్ట్రంలో పరిస్థితి చూస్తే నాటి పొట్టి శ్రీరాములు త్యాగానికి చాలా దూరంగా ఉందని మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు.

**మహనీయుని అడుగుజాడల్లో నడవాలి..సాకె శైలజానాథ్**
తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ఉద్యమించి తన ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా అర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు. చేపట్టిన పనిని పూర్తి చేసే వరకు విశ్రమించని ఆయన లక్షణం అందరూ నేర్చుకోవాలి. అలాంటి మహా మనిషి అడుగుజాడల్లో మనం ముందుకు సాగాలి. తెలుగుజాతి ప్రతిష్టను మసకబార్చేలా పాలన సాగిస్తున్న కూటమి నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాకె శైలజా నాథ్ అన్నారు.


**వైయస్ఆర్‌సీపీ హయాంలోనే ఆయనకు గౌరవం..**

**వెలంపల్లి శ్రీనివాస్**
మహాత్మా గాంధీ ఆశయాలతో ముందుకు సాగిన నాయకులు శ్రీ పొట్టి శ్రీరాములు అని తెలుగు ప్రజలందరూ ఒక్కటిగా కలిసుండాలని, అందు కోసం ప్రత్యేక రాష్ట్రం కోరుతూ 58 రోజులు నిరాహార దీక్ష చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు పేరు తెలుగు జాతి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచే ఉంటుంది. అలాంటి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని చంద్రబాబు విస్మరించి రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1వ తేదీ నుంచి మార్చేశారు. వైయస్ జగన్ సీఎం అయ్యాకనే మళ్లీ నవంబర్ 1న అవతరణ దినోత్సవంగా నిర్వహించడం జరిగింది. అంతే కాకుండా రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టడం ద్వారా దివంగత వైయస్ఆర్ కూడా మహనీయుడిని గౌరవించారు. ఎన్టీఆర్ విగ్రహానికి రూ.1750 కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహ నిర్మాణానికి చంద్రబాబు కనీసం ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వకపోతే ఆర్యవైశ్యులు చందాలు వేసుకుని నిర్మాణం చేయాల్సి వచ్చిందని కానీ ఇప్పుడు విగ్రహావిష్కరణ పేరుతో మేమే చేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయింది. వ్యాపారాలను చేసుకోనివ్వకుండా జీఎస్టీ అధికారులతో దాడులు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# దర్జాగా జవాన్ భూమి కబ్జా

## అక్రమార్కుల దౌర్జన్యం - రెవెన్యూ అధికారులపై తీవ్ర ఆరోపణలు





తమ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారు రెవెన్యూ అధికారులు స్పందించడం లేదంటూ పారిజాతమ్మ కన్నీటి పర్యంతం

**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 16, కళ్యాణదుర్గం**

దేశ సరిహద్దులో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్ కుటుంబానికి స్వగ్రామంలోనే భూమి కోసం పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. జవాన్‌కు చెందిన వ్యవసాయ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి పంటలు వేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.

### అడ్డుకున్న తనపై చంపుతామని బెదిరింపులు

కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన పారిజాతమ్మ భర్త సుబ్బరాయుడు (లేట్) కొడుకు ఆర్మీ జవాన్, ఆర్మీ కుటుంబానికి చెందిన సర్వే నంబర్ 18/1లో 5.08 ఎకరాల భూమి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న ఈ భూమిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కన్నేశారు. జవాన్ దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే నరసింహులు అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి పొలం హద్దులను తొలగించి అక్కడే కంది పంట వేశాడని జవాన్ తల్లి ఆరోపిస్తున్నారు.

పొలం వద్దకు వెళ్లి అడ్డుకున్న తనపై నరసింహులు 10 మందితో వచ్చి చంపుతా మంటూ బెదిరించాడని, మహిళ అని కూడా చూడకుండా దాడికి పాల్పడ్డాడని ఆమె వాపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.

### అధికారులు అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహారింపు

ఇదిలా ఉండగా భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సిన రెవెన్యూ అధికారులు కూడా తమకు న్యాయం చేయడం లేదని జవాన్ తల్లి మండిపడ్డారు. వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్ వరకు కొందరు అధికారులు అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాసులకు కక్కుర్తి పడిన రెవెన్యూ అధికారులు తమను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆమె ఆరోపించారు. సర్వే నంబర్ 18లో మొత్తం 10.16 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అందులో 18/1, 18/2లో 5.08 ఎకరాలు తమ పేరుపై నమోదు ఉన్నాయని ఆమె పేర్కొంది. అయితే భూమిలో పంట ఉందనే కారణంతో సర్వే వాయిదా వేస్తున్నారని, కానీ సంవత్సరాలుగా తమకు న్యాయం జరగకపోవడం బాధాకరమని ఆమె తెలిపారు. దేశానికి సేవ చేస్తున్న తన కొడుకు జవాన్ అని కూడా చూడకుండా తమ భూమిని కబ్జా చేయడం తీవ్ర అన్యాయమని, వెంటనే సర్వే నిర్వహించి భూమికి హద్దులు ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని ఆమె జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయం ఎదుటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. "దేశాన్ని కాపాడుతున్న జవాన్ భూమిని ఏకంగా స్వగ్రామంలోనే మా భూమికి రక్షణ లేకపోతేడ సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి?" అంటూ జవాన్ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకునే తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### అక్రమార్కుడు నరసింహులు పై చర్యలు తీసుకోండి

ఈ సందర్భంగా బాధిత జవాన్ తల్లి మాట్లాడుతూ కళ్యాణదుర్గం మండలం గ్రామంలో మా భూమిని అక్రమంగా నరసింహులు ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నాడని బాధిత మహిళ పేర్కొంది. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను వేడుకొంది. సంవత్సరాలుగా తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ కూడా మహిళ అని చూడకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాక అక్రమార్కులకు అండదండగా నిలిచారన్నారు. అక్రమార్కులకు అధికారులు తమ భూమిని అప్పనంగా కట్టబెట్టారని వాపోయారు. జిల్లా కలెక్టర్ చొరవచూపి మండల తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్, ఆర్ ఐ, వీఆర్వో, మండల సర్వేయర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకుని బాధిత సైనిక జవాన్ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించకుండా న్యాయం చేయకుండా ఉంటే తనకు ఆత్మహత్య చరణ్యమంటూ వాపోయారు.

### రెవెన్యూ అధికారుల చాటున.. అక్రమార్కుల దౌర్జన్యం

మండల రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు అమ్ముడబోయి. ఏకంగా దేశ సేవ చేసే సైనిక జవాన్ భూమిని స్వగ్రామంలో అక్రమార్కులు కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు చుట్టపు చూపు చూసి వారికి వస్తాసు పలుకుతున్నారు. కాసులకు కక్కుర్తి పడిన కొందరు రెవెన్యూ అధికారులు జవాన్ భూమి అని చూడకుండా ఎట్టకేలకు అక్రమార్కులకు కట్టబెట్టారు. అక్రమార్కులు ఏకంగా పదిమంది ఏకమై జవాన్ తల్లి పైనే దాడి చేయడం అత్యంత దుర్మార్గం. అందులోనూ ఒక మహిళ అని కూడా చూడకుండా దౌర్జన్యం చేసి అందులోనూ వీరి భూమిలో అక్రమార్కులు కంది పంట వేయడం ఎంతవరకు సమంజసం. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సిన రెవిన్యూ అధికారులే ..అక్రమార్కులకు అండ దండగా నిలుస్తున్నారు. అందినంత దండుకు తింటున్నారు. అడిగేవాడు లేదని రెవెన్యూ అధికారులు పెచ్చు మీరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు వివిధ ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ కూడా... అనంతపురం జిల్లాలో రెవెన్యూ అధికారులు కోట్లకు పడకులెత్తారు.. ఏసీబీ అధికారులు జిల్లా రెవెన్యూ అధికారులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇలా అక్రమార్చనే ధ్యేయంగా అక్రమార్కులకు వంత పలుకుతూ.. ప్రజల రక్త మాంసాన్ని జలగల పీక్కు తింటున్న రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల, బ్యూరోమార్చి 16 (రిపబ్లిక్ న్యూస్):**

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం, వడదెబ్బ నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఆర్ఓ రాము నాయక్, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వేడిగాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ నుంచి రక్షణ కోసం ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. లేత రంగుల, తేలికపాటి కాటన్ దుస్తులు ధరించడం మంచిదని, రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలని



సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రోజుకు రెండు సార్లు స్నానం చేయడాం మంచిదన్నారు. అత్యవసరం ఉంటేనే ఎండవేళ బయటకు వెళ్లాలని, వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు లేదా టోపీ వంటివి ఉపయోగించాలని సూచించారు. ఇంటిలో గాలి ప్రసరణ ఉండేలా కిటికీలు తెరిచి ఉంచి ఫ్యాన్ ఉపయోగించడం ద్వారా చల్లదనాన్ని పొందవచ్చన్నారు.

**వేసవిలో చేయకూడనివి**

తీవ్ర ఎండ సమయంలో అవసరం లేకుండా బయట తిరగకూడదని కలెక్టర్ సూచించారు. సూర్యకిరణాలు మరియు వేడిగాలులకు నేరుగా గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై విక్రయించే చల్లని రంగు పానీయాలు లేదా కలుషిత ఆహారం తీసుకోవద్దని హెచ్చరించారు. వేసవిలో మాంసాహారం మితంగా తీసుకోవడంతో పాటు మద్యం సేవించరాదన్నారు. ఎండ వేళల్లో శరీరానికి అధిక శ్రమ కలిగించే పనులు చేయకూడదని సూచించారు. నలుపు లేదా మందమైన దుస్తులు ధరించడం కూడా నివారించాలని తెలిపారు.

**వడదెబ్బ లక్షణాలు**

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, మగత లేదా గందరగోళం కలగడం, ఫిట్స్ రావడం లేదా అపస్మారక స్థితికి చేరే అవకాశం ఉండటం వడదెబ్బ లక్షణాలని తెలిపారు.

**ప్రథమ చికిత్స**

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడగల ప్రదేశానికి తరలించాలని సూచించారు. చల్లని నీటిలో తడిపిన గుడ్డతో శరీరాన్ని తుడవడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఫ్యాన్ గాలి లేదా చల్లని గాలి తగిలేలా చూడాలని తెలిపారు. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) ఇవ్వవచ్చన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు లేదా ద్రావణాలు త్రాగించకుండా, వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. అదేవిధంగా వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టేషన్ల వద్ద పోస్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళా ప్రారంభం

**నంద్యాల, బ్యూరోమార్చి 16 (రిపబ్లిక్ న్యూస్):**

నాబార్డ్ ఆర్థిక సహాయంతో అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మేళాను నంద్యాల పట్టణంలోని జె.కే ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ నంద్యాల జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కార్తీక్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ నరసింహారావు తదితరులు పాల్గొని మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ ఉత్పత్తులను తయారు చేయడమే కాకుండా మార్కెటింగ్ అవకాశాలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఉత్పత్తుల బ్రాండింగ్, ప్యాకేజింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మంచి ఆదాయం సాధించవచ్చని తెలిపారు. నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ ఇలాంటి మేళాల ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తయారయ్యే ఉత్పత్తులను తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళలు ఒకరితో ఒకరు అనుభవాలు పంచుకోవడం



ద్వారా కొత్త విషయాలు నేర్చుకుని తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ నరసింహారావు మాట్లాడుతూ వినియోగదారుడు మరియు ఉత్పత్తిదారుడు మధ్య నేరుగా అనుసంధానం కల్పించాలనే ఉద్దేశంతో ఈ మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్పత్తిదారులచే నేరుగా అమ్మకాలు నిర్వహిస్తున్నందున నంద్యాల పట్టణం మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నంద్యాల,



కడప, అనంతపురం జిల్లాలకు చెందిన మహిళలు పాల్గొనగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొన్ని స్వయం సహాయక సంఘాలు కూడా తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. మేళాలో మంగళగిరి చీరలు, చీరాల చేనేత వస్త్రాలు, పొందూరు ఖద్దరు, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, జూట్ బ్యాగులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, పోచంపల్లి చీరలు, వెంకటగిరి చీరలు, ధర్మవరం చీరలు, చెక్కతో తయారు చేసిన బొమ్మలు తదితర ఉత్పత్తులను ప్రదర్శనకు మరియు అమ్మకానికి ఉంచారు. నంద్యాల ప్రాంత ప్రజలు ఈ మేళాను సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రోత్సాహం అందించడంతో పాటు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి

# 125వ జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





**నంద్యాల, బ్యూరో మార్చి 16( రిపబ్లిక్ న్యూస్):**అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి సందర్భంగా సోమవారం నంద్యాల పట్టణంలోని సంజీవ్ నగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు గారు మహాత్మా గాంధీ ఆలోచనలకు ప్రేరణగా పనిచేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా సమాజంలో సమానత్వం నెలకొల్పాలనే సంకల్పంతో ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన విషయం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు గారి త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ అమరావతిలో ఆయన 58 రోజుల నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల పొట్టి శ్రీరాములు గారి విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. పొట్టి శ్రీరాములు గారి ఆశయాలు, త్యాగస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో డిఆర్ఓ రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మునిసిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల ఆర్డిఓ విశ్వనాథ్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంతో రైతులకు చేయూత

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల, బ్యూరో మార్చి 16 (రిపబ్లిక్ న్యూస్):**

రైతులకు అవసరమైన సహాయక సహకారాలను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసే దిశగా "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం "రైతన్న – మీకోసం" కార్యక్రమంపై వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సేవలు, సాంకేతిక సలహాలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 16 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైతే మార్చి 23 నుంచి 25 వరకు మరో విడతగా కూడా కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు మొబైల్ ఫోన్‌లో ఫార్మర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించడంతో పాటు రైతులకు ఫార్మర్ ఐడీ రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ యాప్ ద్వారా రైతుల పంట వివరాలు, భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, పంటలకు తలెత్తే చీడపీడల వివరాలు వంటి సమాచారం సమగ్రంగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డీఆర్ఓ రాము నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీగ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

## ప్రజలు అపోహలు నమ్మకుండా అవసరానికి అనుగుణంగా మాత్రమే బుకింగ్ చేసుకోవాలి

### జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్



**నంద్యాల, బ్యూరోమార్చి 16 (రిపబ్లిక్ న్యూస్):**

జిల్లాలో వంట గ్యాస్ (ఎల్పీజి) సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు అపోహలకు లోనవకుండా అవసరానికి అనుగుణంగా మాత్రమే సిలిండర్లు బుక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదు స్వీకరణలో భాగంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా, పర్యవేక్షణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ప్రతిరోజూ సగటున సుమారు 10,000 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయన్నారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. అయితే గత 34 రోజులుగా గ్యాస్ బుకింగ్స్ సంఖ్య అసాధారణంగా పెరిగి రోజుకు సుమారు 46,000కు చేరుకుందని, కొంతమంది వినియోగదారులు ఖాళీ సిలిండర్లు లేకపోయినా ముందస్తుగా బుకింగ్స్ చేస్తున్నట్లు గుర్తించినట్టు చెప్పారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జేసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 35 గ్యాస్ ఏజెన్సీల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించామన్నారు. ఈ అధికారులు ప్రతి ఆరు గంటలకు ఒకసారి గ్యాస్ స్టాక్, బుకింగ్స్ మరియు డెలివరీ వివరాలను సమీక్షించి నివేదికలు సమర్పించాలని ఆదేశించామన్నారు. గ్యాస్ సిలిండర్ల మళ్లింపు లేదా బ్లాక్ మార్కెటింగ్ వంటి అక్రమాలను అరికట్టేందుకు ఆర్‌డీవోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

**సంక్షేమ సంస్థలకు ప్రాధాన్యత**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, సంక్షేమ వసతిగృహాలు మరియు ప్రభుత్వ ఆసుపత్రులు (జీజీహెచ్ వంటి) సంస్థల్లో గ్యాస్ కొరత లేకుండా అవసరమైన సిలిండర్ల సరఫరాను ప్రాధాన్యతతో అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు**

గ్యాస్ సరఫరా సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కాల్ సెంటర్‌లో వెల్ఫేర్, హెల్త్ మరియు ఎడ్యుకేషన్ విభాగాల ప్రతినిధులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తారన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com

## పలు సమస్యల పరిష్కారానికి మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు.




**మల్లాపూర్ మార్చి 16 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిందని వాటన్నిటినీ వెంటనే నెరవేర్చాలని కోరుతూ బిజెపి మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గోపిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు పింఛన్లు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లకు అర్హులైన అభ్యర్థులందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయడం లేదని, దీనివలన రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తూ అప్పులపాలవుతున్నారని అన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మీ పథకం డబ్బులు, అలాగే డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణ పనులకు సంబంధించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని మనవి చేసారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, వేంపల్లి సర్పంచ్ రాజేందర్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్, బిజెవైయం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుర్మ రాజారెడ్డి, శక్తి కేంద్రం ఇంచార్జ్ మొరపు జలపతి, మల్లాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముస్కరి రాజ్‌కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### యంపి అర్వింద్ ధర్మపురి



**మల్లాపూర్ మార్చి 16 (రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి లేఖ రాశారు. జిల్లాలో ఈ సంవత్సరం పెద్ద ఎత్తున మక్క పంట పండిందని, అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1700 నుంచి రూ.1800 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.దీని వల్ల ప్రతి రైతు సగటున ఎకరాకు రూ.20,000 నుండి రూ.25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ తెలిపారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.

## అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఘనంగా

### ఓర్వకల్లుమండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగ అనసూయ



**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 16.(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండల కేంద్రంలో ఆదివారం రోజున మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి మండల పరిషత్ అధికారి మాట్లాడుతూ, నాగ అనసూయ మాట్లాడుతూతెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్రం కొరకు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి మరణించిన గొప్ప వ్యక్తి,శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయము ఓర్వకల్లు యందు మండల్ పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగానిర్వహించడం జరిగినది, ఈ వేడుకలైందు పొట్టి శ్రీరాములు తన ప్రాణాన్ని లెక్కచేయకుండా నిరాహారదీక్ష చేసిపేద ప్రజల సంక్షేమం కొరకు పాటుపడడం జరిగినది, మరియు భారత స్వాతంత్ర ఉద్యమంలో అహింస మరియు సామాజిక సమానత్వాన్ని చాటి చెప్పారు. పొట్టి శ్రీరాములు జయంతి మనకు త్యాగాన్ని వారి యొక్క సంకల్పాన్ని గుర్తుచేస్తుందిఅని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి ,గోవిందరెడ్డి ,రాంభూపాల్ రెడ్డి,సుధాకరయ్య, పంచాయతీరాజ్ ఇంజనీరు సురేంద్రనాథ్ రెడ్డి, ఇ ఓ ఆర్ డి శాంతయ్య, మండల స్వర్ణ గ్రామ అధికారి సుధీర్, కార్యాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథక సిబ్బంది అందరూ పాల్గొనడం జరిగింది

## గుండెపోటుతో వివాహితుడు మృతి- నివాళులర్పించిన సర్పంచ్ జైపాల్ రెడ్డి.


మృతుడు శ్రీనివాసులు



**ఓబులవారిపల్లి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం బొంత వారి పల్లి గ్రామం లో ఆదివారం రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో వివాహితుడు యేరకతోటి శ్రీనివాసులు గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలియజేశారు అతనికి వయసు సుమారు 28 లేక 29 సంవత్సరాలు ఉండవచ్చని వారు అన్నారు, అతనికి భార్య ముగ్గురు చిన్నారులు ఉన్నారని అందరూ నాలుగు సంవత్సరాలు లోపు వారే అని తెలియజేశారు రెక్కాడితే గాని డొక్కడినిండని కుటుంబం అని, దళిత కులానికి చెందిన మృతుడు శ్రీనివాసులుగత 6సంవత్సరాల క్రితం వడ్డెర పొలానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు ఊహించని ఈ పరిణామం ఆ అమ్మాయి జీవితాన్ని చీకటిలోకి నెట్టిందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, విషయము తెలుసుకున్న స్థానిక సర్పంచి నూక జయపాల్ రెడ్డి బొంత వారి పల్లి గ్రామం మృతుడు శ్రీనివాసులు స్వగృహం చేరుకొని ఆయన పార్థివదేహానికి నివాళు లర్పించారు, అనంతరం మృతుని కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు, అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తనవంతుగా కొంత ఆర్థిక సహాయం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో శ్రీనివాసులు గుండెపోటుతో మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని ఆ లోటు ఎవరూ పూడ్చలేనిదని, నా వంతుగా మీ కుటుంబానికి అండగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి సహాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు,ఆయన వెంట పలువురు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు, అనంతరం శ్రీనివాసులు అంత్యక్రియలను నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## ప్రశాంతంగా ముగిసిన తొలి రోజు 10వ తరగతి పరీక్ష

### - సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు.




**ఓబులవారిపల్లి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం లో మార్చి 16 సోమవారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయని సోమవారం ఓబులవారిపల్లె సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు అన్నారు, మండలంలో తల్లెం వారి పల్లి గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముక్కవారిపల్లి పంచాయతీ కడప చెన్నై రహదారిలోని గురుకుల ఉన్నత పాఠశాల, మండల కేంద్రం ఓబులవారిపల్లె పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోను పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి అన్ని సెంటర్లలో సెక్యూరిటీ భద్రతా చర్యలు పకడ్బందీగా తీసుకున్నామని ఆయన అన్నారు, పరీక్షలు జరుగుతున్న సెంటర్ల పరిసరాలలో ప్రజలు ఒకరికి మించిగుమికూడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, ప్రతి పరీక్షా కేంద్రం లోను ఇద్దరు పోలీసులతోపాటు ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులను భద్రత దృష్ట్యా నియమించడం జరిగిందన్నారు అనుక్షణం వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద చర్యలు తీసుకుంటున్నారని సబ్ ఇన్స్పెక్టర్ అయిన నేను మరో నలుగురు పోలీసులతో అన్ని సెంటర్లో తిరుగుతూ భద్రతా చర్యలను పర్యవేక్షించామన్నారు, ఓబులవారిపల్లి పరీక్ష కేంద్రంలో 192 మంది, ముక్కవారిపల్లి పరీక్షా కేంద్రంలో 126 మంది, తల్లేంవారిపల్లి పరీక్షా కేంద్రంలో 176 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాశారని ఆయన అన్నారు ఏసెంటర్లోనూ ఆబ్సెంట్ ఒకటి కూడా లేదన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంతంగా తొలిరోజు పరీక్షలు ముగిశాయని ఆయన తెలియజేశారు, ఎండలు మండుతుండడంతో విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురు కాకుండా ఉండేందుకు ప్రతి సెంటర్ లోనూ ఇద్దరూ ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక చికిత్స నిమిత్తం మందులతో సిద్ధంగా ఉండేందుకు వైద్యాధికారులు ప్రతి సెంటర్లో ఇద్దరిని నియమించడం జరిగిందన్నారు

## ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు




**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్**
పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి మండలంలోని విజయ వాణి నగర్ చౌడేపల్లి పట్టణంలోని ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలందు విద్యార్థులకు పది పరీక్షల నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు రెండు కేంద్రాలు కలిపి 557 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు హాజరు కాలేదని ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయాన్నే విద్యార్థులు వారి తల్లిదండ్రులు చేరుకున్నారు ప్రభుత్వం మేరకు ప్రతి కేంద్రం ముందు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఆయన వివరించారు. కాగా పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో ఆర్టీసీ సేవలు లేనందున పలువురు ఇబ్బందులు పడ్డారు పరీక్ష సమయంలోనైనా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్**
పనుల వసూలను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ అన్నారు మండల కేంద్రమైన చౌడేపల్లి సచివాలయంలో ఈ మేరకు సచివాలయ అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి పనుల వసూళ్లలోనే ఉంటుందని ప్రతి ఒక్కరు బకాయిలు వసూలు చేసి సహకరించాలని కోరారు ఇంటి పన్నులపై యజమానులకు అవగాహన కల్పించి వారి నుంచి వసూళ్లు చేయాలని కోరారు. అంతేకాకుండా పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు మంచినీటి సమస్య తరతకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఓ శివయ్య, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 16 రిపబ్లిక్ న్యూస్**
భాష సంయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు గారి కాశ్య విగ్రహం ప్రతిష్టించుచున్న సందర్భముగా చౌడేపల్లి బజారు వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానము ముందర వాసవి సేవకులు ఆర్యవైశ్య మహిళా మండలి మరియు వాసవి క్లబ్ వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూజా కార్యక్రమం అనంతరం స్వీట్స్ పంచడం జరిగినది 1901వ సంవత్సరం మార్చి 16వ తేదీన నెల్లూరు జిల్లాలో జన్మించారు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహారదీక్ష చేసి 58రోజులు పోరాడి డిసెంబర్ 15వ తేదీన ప్రాణాలు అర్పించారు. 58 రోజులు నిరాహార దీక్ష కు గుర్తుగా 58 అడుగులు విగ్రహమును అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్టించడం జరిగిందని ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు.

# పిజిఆర్ఎస్ సమస్యల పై సకాలంలో స్పందించండి..



**- సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించొద్దు.. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**- గత వైసీపీ ప్రభుత్వ పాలన లో వైకల్యం సర్టిఫికెట్ అందించి పెన్షన్ అందేది..**

**- ఈ కూటమి ప్రభుత్వ పాలనలో రీ - వెరిఫికేషన్ పేరిట పెన్షన్ తొలగించారని వికలాంగుడు ఆవేదన..**

**మదనపల్లి మార్చి 16 - (రిపబ్లిక్ న్యూస్) -**
జిల్లా కలెక్టరేట్లోని కోర్టు సముదాయంలో సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి కేంద్రంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్వయంగా విచ్చేసి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావు, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లాకళ్యాణి, ఏడి సర్వే భరత్ కుమార్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, డ్వామా పిడి వెంకటరత్నం ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించినమండలాలను, గ్రామాలను పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 346 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

### ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

రామసముద్రం మండల కేంద్రమైన నారిగానిపల్లి గ్రామ ప్రజలు గ్రామంలో ఏర్పాటు చేయవలసినటువంటి ప్రభుత్వ ఆసుపత్రిని, మా గ్రామ పరిధిలో కాకుండా ప్రస్తుతం కమ్మవారిపల్లిలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నందున, దాన్ని పరిశీలించి నారిగానిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు మమేకమై జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. బి.కొత్తకోట నగర పంచాయతీ కేంద్రానికి చెందిన స్థానిక బజారు వీధిలో కాపురం ఉన్నటువంటి బి. దినకర్ కుమార్ అనారోగ్యం కారణంగా నడవలేని పరిస్థితిలో ఉన్నందున, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ వేలూరులో చికిత్స చేయించుకుంటున్నాడు. ప్రస్తుతం తను లేవ లేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. అతడికి ఎలాంటి జీవనాధారం లేకపోవడంతో భార్యా పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉందని ప్రభుత్వం నుంచి వికలాంగ పెన్షన్ మంజూరు చేయించాలని జిల్లా కలెక్టర్ కు అర్జీని సమర్పించుకున్నాడు. బి.కొత్తకోట మండల కేంద్రమైన గొల్లపల్లి గ్రామానికి చెందిన బి.మనోహర్ అనే వ్యక్తి తనకు వైకల్యం కారణంగా నడవలేని స్థితిలో ఉన్నానని గత ప్రభుత్వంలో మంజూరైన నా వైకల్య పెన్షన్ ను కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరిట సంబంధిత అధికారులు నిలిపివేశారు. దయచేసి నా పరిస్థితిని గమనించి నాకు వైకల్య పెన్షన్ మళ్లీ మంజూరు చేసి న్యాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను విన్నవించుకున్నాడు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు వివిధ రకాల అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

